RNI NO: TEL/TEL/2009/28544

సంపుటి : 18 సంచిక : 136 Vol : 18 Issue : 136

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్




# పీపుల్స్ డైరీ


సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, శుక్రవారం 24 జూలై 2026
Warangal, Friday 24 July 2026

పేజీలు : 08 వెల రూ : 4-00

Pages : 08 Price : 4-00



WANTED

పీపుల్స్‌డైరీ దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు
- హనుమకొండ ◆ కరీంనగర్
- భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
- జనగామ ◆ మహబూబాబాద్
- హైదరాబాద్ ◆ నిజామాబాద్

Cell : 9493019044
9618509859




## పాలిమర్ నోట్ల దిశగా అడుగులు

- త్వరలో చేతికి ప్లాస్టిక్ నోట్లు!
- రూ.10, 20 నోట్లపై తొలుత ప్రయోగాలు
- సక్సెస్ అయితే కాగితపు కరెన్సీ ఇక కనుమరుగు?

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** ఇండియా త్వరలోనే సాంప్రదాయ కాగితపు కరెన్సీ స్థానంలో పాలిమర్ లేదా ప్లాస్టిక్ నోట్లను వినియోగించే దేశాల జాబితాలో చేరనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన కరెన్సీ ముద్రణ సంస్థ భార రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్, జూలై 17, 2026న.. భారతీయ నోట్ల కోసం సెక్యూరిటీ-గ్రేడ్ పాలిమర్ సబ్‌స్ట్రేట్‌ను సరఫరా చేయమని తయారీదారులను ఆహ్వానిస్తూ అంతర్జాతీయ టెండర్ విడుదల చేసింది. ఆర్‌బీఐ ఇంకా ప్లాస్టిక్ కరెన్సీని విడుదల చేస్తున్నట్లు ప్రకటించనప్పటికీ.. దాని గ్లోబల్ టెండర్‌ను పాలిమర్ కరెన్సీ క్షేత్రస్థాయి ప్రయోగాల

(మిగతా 2లో...)

## ఉపగ్రహ చిత్రంలో పే..ద్ద రుతుపవన మేఘం?

# భారీ ఆశాదీపం



- ఏకంగా 10వేల కి.మీల మేర విస్తరణ
- నార్త్ ఇండియా నుంచి దక్షిణ కొరియా వరకు...
- దీంతో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** వేసవి ముగిసిపోయి వర్షాకాలం వచ్చేసినా ఇంకా వర్షాలు లేక అల్లాడుతున్న భారత్ కు మరో గుడ్ న్యూస్ అందింది. భారత్ కు సకాలంలో రావాల్సిన నైరుతి రుతుపవనాలు వచ్చినా ఎల్ నినో ప్రభావంతో వాటి పురోగతి లేక దేశవ్యాప్తంగా తక్కువ వర్షపాతం నమోదవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు రుతుపవనాలకు ఊతమిచ్చేలా భారత్ నుంచి కొరియా వరకూ ఏకంగా 10 వేల కిలోమీటర్ల పాటు ఓ భారీ రుతుపవన మేఘం విస్తరించినట్లు కనిపిస్తున్న ఉపగ్రహ చిత్రంతో ఇండియా టుడే ఓ కథనం ప్రచురించింది. ఇందులో ఉత్తర

(మిగతా 2లో...)

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** నీట్ పరీక్షా ప్రశ్న పత్రాల లీకేజీ అంశం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జంతర్‌మంతర్ కేంద్రంగా ప్రారంభమైన ఆందోళనలు తీవ్రరూపం దాల్చడం, పార్లమెంట్‌ను వాయిదాల పర్వం ముంచెత్తడంతో ప్రధాని నరేంద్ర మోదీయే ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేసి నిందితులకు తక్షణమే (మిగతా 2లో...)

## ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తాం..



- నీట్ 'లీకేజీ' విచారణ వేగవంతం అవుతుంది
- విద్యార్థుల ప్రయోజనాలే మాకు ముఖ్యం
- ప్రకటించిన ప్రధాని మోదీ

# అడియాశలైన హజ్‌హౌస్ ఆశలు

## గిర్మాజిపేటలో 1800 గజాల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం




- సర్వే నంబర్ 10లో హజ్ హౌస్‌కి ఆ భూమి కేటాయింపు
- హజ్‌హౌస్‌కు 1400, వీధి వ్యాపారాలకు 400 గజాలు...
- అప్పటి వరంగల్ జిల్లా కలెక్టర్ అధికారిక ఉత్తర్వులు
- ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన ప్రైవేటు వ్యక్తులు
- ప్రజా ప్రతినిధులు, అధికారులు మారడంతో పరిస్థితులు తారుమారు
- ప్రస్తుత కలెక్టర్ చొరవ తీసుకోవాలంటున్న ప్రజలు

2వ పేజీలో..

## 'డ్రగ్స్ కేసులో ఇరికిస్తా'

- బెదిరించిన ముంబై కానిస్టేబుల్ సస్పెండ్
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన పోలీసు దాష్టీకం వీడియో




**పీపుల్స్‌డైరీ-ముంబై :** ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అక్రమ కేసులు బనాయిస్తామని బెదిరింపులకు దిగిన ఓ ముంబై పోలీస్ అధికారి ఉదంతం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహ జ్వాలలను రగిలించింది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనల్లో పాల్గొంటున్న యవతను భయభ్రాంతులకు గురిచేసేలా మాట్లాడిన పోలీసు అధికారిక వీడియో బయటకు రావడంతో.. ముంబై పోలీస్ యంత్రాంగం సదరు

(మిగతా 2లో...)

## సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని...

- కానిస్టేబుల్ ఆత్మహత్య...
- తెలంగాణ డీజీపీ కార్యాలయంలో కలకలం



2లో



## నా చావుకు ప్రధాని మోదీ కారణం..

సర్ ఫామ్ మీద సూసైడ్ నోట్ రాసి యువకుడి ఆత్మహత్య

2వ పేజీలో..



కాలం చెరపలేని ఊరి కథ

## గర్వానికి నిలువెత్తు శాసనం

# గణపురం

కనిపించే చరిత్రకు 792 ఏండ్లు

- ఘనమైన వారసత్వపు వెలుగులకు కేరాఫ్...
- నేటికీ చెరగని కాకతీయుల ముద్ర
- శిలల్లో నిద్రిస్తున్న సామ్రాజ్యం...
- మరో 8 ఏళ్లయితే 800 సంవత్సరాలు పూర్తి
- గణపసముద్రం, కోటగుళ్ళు, రెడ్డిగుడి గంభీర గర్జన
- చెరువులో నిక్షిప్తమైన ఇంజినీరింగ్ ప్రతిభ...

7లో



# పాలిమర్ నోట్ల దిశగా అడుగులు...

(మొదటి పేజీ తరువాయి)

దిశగా వేసిన మొదటి స్పష్టమైన అడుగుగా విస్తృతంగా పరిగణిస్తున్నారు. ఈ ప్రయోగాలు బహుశా రూ.10, రూ.20 విలువ గల నోట్లపై ప్రయోగాలు నిర్వహించనుంది. ఈ ప్రక్రియ కోసం 68,000 రీముల బైయాక్సివల్లీ ఓరియంటెడ్ పాలిప్రొపైలిన్ ఆధారిత పాలిమర్ పదార్థాన్ని కోరింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు గనుక విజయవంతమైతే కాగితపు కరెన్సీకి బదులుగా ఎక్కువ విలువ గల డినామినేషన్లలో కూడా పాలిమర్ నోట్లను ముద్రించే అవకాశాలు ఉన్నాయి.

**ఈ మార్పు వెనుక ఉద్దేశాలు ఇవే...**

దీనికి తక్షణ కారణం మన్నిక, ఖరీదు కావచ్చు. మనం రోజువారీగా వాడే రూ.10, రూ.20 వంటి తక్కువ విలువ గల నోట్లు వేగంగా చేతులు మారుతుంటాయి. ఫలితంగా అవి అధిక విలువ గల నోట్ల కంటే చాలా వేగంగా మురికిగా, చిరిగిపోయి , చలామణికి పనికిరాకుండా పోతాయి. కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు మానవ చేతుల నుంచి వచ్చే మురికి, నూనె లేదా తేమను పీల్చుకోవు. తద్వారా ఇవి చలామణిలో ఉన్నంత కాలం పరిశుభ్రంగా, ధృడంగా ఉంటాయి. 'ప్లాస్టిక్ మనీ' అని పిలవబడినప్పటికీ.. పాలిమర్ నోట్లను సాధారణ ప్లాస్టిక్‌తో తయారు చేయరు. వాటిని ప్రత్యేకంగా బ్యాంక్ నోట్ల కోసం రూపొందించిన సాధారణంగా బైయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలిప్రొఫైలిన్ వంటి ప్రత్యేకంగా తయారు చేయబడిన పాలిమర్ సబ్‌స్ట్రేట్ నుంచి తయారు చేస్తారు.

**ప్లాస్టిక్ నోట్లు ఎంత కాలం మన్నుతాయి?**

ప్లాస్టిక్ నోట్ల అతిపెద్ద ప్రయోజనాల్లో ఒకటి మన్నిక. అధ్యయనాలు, ఆర్బీఐ అనుభవం ప్రకారం.. సాంప్రదాయ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు సాధారణంగా రెండు నుంచి రెండున్నర రెట్లు ఎక్కువ కాలం చలామణిలో ఉంటాయి. వాటి రంధ్రాలు లేని ఉపరితలం తేమ, మురికి, చెమట, జిడ్డు, రోజువారీ అరుగుదల, చిరుగుదలను తట్టుకునేలా చేస్తుంది.

# సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని...

- కానిస్టేబుల్ ఆత్మహత్య...
- తెలంగాణ డీజీపీ కార్యాలయంలో కలకలం

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : హైదరాబాద్ లోని లక్డీ కా పూల్‌లో ఉన్న తెలంగాణా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఊహించని షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. అక్కడ విధులలో ఉన్న స్వామి అనే పోలీస్ కానిస్టేబుల్ తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్ తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది.

మొన్నటికి మొన్న త్రిపుర డిజిపి అనురాగ్ ధన్కర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మరచిపోకముందే తెలంగాణ డీజీపీ కార్యాలయంలో మరొక ఆత్మహత్య ఘటన చోటు చేసుకోవటం సంచలనంగా మారింది. ఈ ఘటన వివరాలలోకి వెళితే తెలంగాణా డీజీపీ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న స్వామి అనే కానిస్టేబుల్ నిన్న రాత్రి విధులు నిర్వర్తించారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల 30 నిమిషాల ప్రాంతంలో వాష్ రూమ్ కి వెళ్ళాడు.

స్వామి తనతో తీసుకు వెళ్లిన సర్వీస్ రివాల్వర్ తో తనను తానే కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నాడు. శబ్దం విని వెంటనే స్పందించిన తోటి సిబ్బంది వాష్‌రూమ్‌కి వెళ్లేసరికి స్వామి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం స్వామి కుటుంబ కలహాలు, వ్యక్తిగత కారణాలతో ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు.

# ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

శిక్ష పడేలా ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ఎక్స్ వేదికగా ప్రకటించారు.

యువత, విద్యార్థుల ప్రయోజనాలు, వారి సంక్షేమమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవాలని చూసే అక్రమార్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచి పెట్టబోమని హెచ్చరించారు. పేపర్ లీకేజీకి కారణమైన బాధ్యులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి అవసరమైన అన్ని చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

# 'డ్రగ్స్ కేసులో ఇరికిస్తా'

(మొదటి పేజీ తరువాయి)

అధికారిని విధుల్లో నుంచి తొలగిస్తూ సస్పెన్షన్ వేటు వేసింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. విద్యార్థి ఆందోళనలను అణచివేసేందుకు ముంబై పోలీసులు అనుసరిస్తున్న తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. 'కాక్రోచ్ జనతా పార్టీ' పిలుపు మేరకు శివాజీ పార్క్, చెంబూర్, ఆజాద్ మైదాన్ వంటి కీలక ప్రాంతాల్లో ఆందోళన బాట పట్టిన విద్యార్థులను బెదిరిస్తూ.. వారిపై అక్రమంగా మత్తుపదార్థాల కేసులు మోపుతానంటూ ఒక పోలీస్ డ్రైవర్ బెదిరింపులకు దిగిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోపై ముంబై కాంగ్రెస్ విభాగం ఎక్స్ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో అధికారులు తక్షణ చర్యలకు పూనుకున్నారు.

**వైరల్ వీడియోలోని షాకింగ్ వ్యాఖ్యలు..**

పోలీస్ వ్యాన్‌లో బంధించిన విద్యార్థులను ఉద్దేశించి డ్రైవర్ సీటులో ఉన్న పోలీస్ సిబ్బంది తీవ్రమైన భాషలో బెదిరించడం ఆ వీడియోలో స్పష్టంగా కనిపించింది. "మీరు మళ్లీ ఇక్కడ నిరసనల్లో కనిపిస్తే మీ జీవితాలను నాశనం చేస్తాను. మీ బ్యాగుల్లో 50 నుంచి 50 గ్రాముల డ్రగ్స్ పౌడర్ పెట్టి అక్రమ కేసులు పెడతా. దాంతో మీ జీవితం శాశ్వతంగా ముగిసిపోతుంది" అని హెచ్చరించాడు.

ఈ తీవ్ర పరిణామాన్ని పరిగణనలోకి తీసుకున్న ముంబై పోలీస్ ఉన్నతాధికారులు.. వీడియో ప్రామాణికతపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఇందులో భాగంగా ముందుగా ఆ వీడియోలో కనిపించిన సీనియర్ డ్రైవర్‌ను ప్రస్తుత పోస్టింగ్ నుంచి తొలగించి సస్పెండ్ చేశారు. పూర్తి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.


# అడియాశలైన హజ్‌హౌస్ ఆశలు


## గిర్మాజిపేటలో 1800 గజాల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం


- సర్వే నంబర్ 10లో హజ్ హౌస్‌కి ఆ భూమి కేటాయింపు
- హజ్‌హౌస్‌కు 1400, వీధి వ్యాపారాలకు 400 గజాలు...
- అప్పటి వరంగల్ జిల్లా కలెక్టర్ అధికారిక ఉత్తర్వులు
- ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన ప్రైవేటు వ్యక్తులు
- ప్రజా ప్రతినిధులు, అధికారులు మారడంతో పరిస్థితులు తారుమారు
- ప్రస్తుత కలెక్టర్ చొరవ తీసుకోవాలంటున్న ప్రజలు

పీపుల్స్‌డైరీ ప్రతినిధి, వరంగల్

వరంగల్ నగరంలో ఒక్కొక్కటిగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన ఘటనలు బయటపడుతున్నాయి. గతంలో కొన్ని సర్వే నంబర్ భూముల్లో వక్ఫ్ బోర్డుకు సంబంధించిన భూములను అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వరంగల్ రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్ ప్రాంతంలోని చిరు వ్యాపార సముదాయాలకు అతి దగ్గరలో దాదాపు 1800 గజాల స్థలం కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించే ప్రయత్నం చేస్తూ బోర్డు సైతం ఏర్పాటు చేసి కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మైనారిటీ పెద్దలు వీధి వ్యాపారులు వాపోతున్నారు. గతంలో వరంగల్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రెవెన్యూ అధికారులకు సంబంధిత సర్వే నంబర్ లో ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రహరీ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. 18 వందల గజాల స్థలాన్ని విడిగా 1400 గజాలు ముస్లింలకు హజ్ హౌస్ కొరకు మిగతా 400 గజాలు చిరు వ్యాపార సముదాయాలు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేస్తూ అందుకు సంబంధించిన ప్రతి అప్పటి శాసన సభ్యులు నన్నపనేని నరేందర్ కి సైతం ఇచ్చినట్టు తెలిసింది. అందుకు మాజీ ఎమ్మెల్యే సైతం అంగీకరిస్తూ సంబంధిత వరంగల్ తహసీల్దార్‌కి , సంబంధిత అధికారులకు సైతం ఉత్తర్వులు ఇచ్చారని కలెక్టర్ ప్రతులను జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారికి జారీ చేసినట్టు మైనారిటీ పెద్దలు తెలిపారు. ప్రస్తుతం అధికారులు, ప్రజా ప్రతినిధులు మారుతుండడంతో సంబంధిత స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి బోర్డు పట్టినప్పటికీ చర్యలు తీసుకోవటంలో జాప్యం చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సర్వే నంబర్ పరిశీలించి స్థలం పత్రాలు పరిశీలిస్తూ గత కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు అట్టి స్థలాన్ని హజ్ హౌస్‌కి, చిరు వ్యాపార సముదాయాలకు కేటాయించాలని వేడుకుంటున్నారు.










కేటీఆర్‌తో శిలాఫలకం ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు అధికారులు

# భారీ ఆశాదీపం...

(మొదటి పేజీ తరువాయి)

భారతం నుంచి హిమాలయాలు, చైనా మీదుగా దక్షిణ కొరియా వరకు విస్తరించి 7 వేల నుంచి 10 వేల కిలోమీటర్ల పొడవైన అద్భుతమైన వర్షపు మేఘం కనిపిస్తోంది. దీన్ని ఉపగ్రహ చిత్రాల్లో బంధించారు. రుతుపవనాల్ని మోసుకొస్తున్నట్లు కనిపిస్తున్న ఈ భారీ మేఘాల వరుస ఇప్పుడు భారత్ కు ఆశాదీపంలా కనిపిస్తోంది. ఇందుకంటే ఈ 10 వేల కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన భారీ మేఘాల వల్ల అంతే భారీ స్థాయిలో వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు.

వర్షపాత అంచనాల ప్రకారం గత రెండు రోజుల్లో భారత్ లో సాధారణ రోజువారీ రుతుపవన వర్షపాతంలో సుమారు 170–180 శాతం నమోదు చేసినట్లు అంచనా వేశారు. దీంతో ఇది ఈ సీజన్‌లో ఇప్పటివరకు అత్యధిక వర్షపాతం నమోదైన సమయంగా ఇది నిలిచింది. వాతావరణ శాస్త్రవేత్తలు అయితే ఈ సంఘటనను భారీ రుతుపవన దినంగా అభివర్ణిస్తున్నారు. ఎందుకంటే అనేక ప్రాంతాలలో వర్షపాతం వాతావరణ సగటులను ఇది మించిపోయింది. రుతుపవన ద్రోణి చురుకుగా ఉన్నప్పుడు వెచ్చని, తేమతో కూడిన గాలి పైకి లేచి విశాలమైన ప్రాంతంలోకి చేరినప్పుడు ఇలాంటి పొడవైన మేఘాల వరుసలు ఏర్పడతాయి. తేమతో కూడిన గాలి పైకి లేచినప్పుడు, అది చల్లబడి, భారీ వర్షాన్ని కురిపించే మేఘాలుగా ఘనీభవిస్తుంది.

# నా చావుకు ప్రధాని మోదీ కారణం..

**సర్ ఫామ్ మీద సూసైడ్ నోట్ రాసి యువకుడి ఆత్మహత్య**

**పీపుల్స్‌డైరీ–సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన పిట్ల వంశీ అనే యువకుడు తన ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అయితే.. వంశీ తాను ఉరివేసుకోవడానికి ముందు రాసిన సూసైడ్ నోట్‌లో పేర్కొన్న విషయాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తన చావుకు కేవలం ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే కారణమని పేర్కొనడం తీవ్ర కలకలం రేపుతోంది. తన కుటుంబంలోని ఎవరినీ ఇబ్బంది పెట్టొద్దు అని అందులో రాయడం ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది.

స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. వంశీ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో లభించిన ఆత్మహత్య లేఖను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. తన ఆత్మహత్యకు కారణం ప్రధాని మోదీ అంటూ వంశీ తన సూసైడ్ లెటర్‌లో రాసిపెట్టినా.. అతడు చనిపోవడానికి దారితీసిన అసలు కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు.

ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతుండగా.. వంశీ అదే ఎస్ఐఆర్ ఫామ్ మీద స్పష్టంగా సూసైడ్ నోట్ రాసి పెట్టి ఉరివేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత సమస్యల వల్ల వంశీ ఉరి వేసుకున్నాడా లేక.. నిరుద్యోగం, ఇతర కారణాల వల్ల ప్రాణాలు తీసుకున్నాడా అనే అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. సూసైడ్ నోట్‌లో చేసిన వ్యాఖ్యలను కూడా దర్యాప్తులో భాగంగా విశ్లేషిస్తున్నారు. అయితే ఇప్పటివరకు వంశీ ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# భట్టికి సమస్యల స్వాగతం

- ఉపముఖ్యమంత్రి పర్యటనపై ప్రభావిత గ్రామాల ప్రజల్లో భారీ ఆశలు
- కాలుష్య నియంత్రణ నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకు ప్రధాన డిమాండ్లు.

**పినపాక, జూలై 23 (పీపుల్స్‌డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం బీటీపీఎస్‌లో పర్యటించి నూతనంగా ఏర్పాటుచేసిన డిఏవి పాఠశాలను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో పరిసర గ్రామాల ప్రజలు బిటిపీఎస్ ఏర్పాటైన నుండి తాము పడుతున్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తిచేస్తున్నారు. బీటీపీఎస్ స్థాపనతో ప్రాంతానికి ఉపాధి, అభివృద్ధి అవకాశాలు పెరిగినప్పటికీ, కాలుష్యం, ఆరోగ్య సమస్యలు, మౌలిక సదుపాయాల కొరత వంటి ఇబ్బందులు ఇప్పటికీ వెంటాడుతున్నాయని స్థానిక గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పర్యటనలో ప్రజా సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీలు లభించాలని కోరుతున్నారు. ప్రధానంగా బీటీపీఎస్ నుంచి వెలువడుతున్న బూడిద, దుమ్ము, పొగ కారణంగా పరిసర గ్రామాల ప్రజలు శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు




పడుతున్నారని చెబుతున్నారు. కాలుష్య నియంత్రణకు ఆధునిక సాంకేతిక చర్యలు చేపట్టడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు శాశ్వత ప్రణాళిక అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరుతున్నారు. అలాగే మణుగూరు నుంచి ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారి నిత్యం బీటీపీఎస్ కి బొగ్గు రవాణా చేసే బొగ్గు లారీలు, భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా మారుతోందని, ఇరుకైన రహదారి కారణంగా ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ రహదారిని తక్షణమే విస్తరించాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా బీటీపీఎస్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ప్రభావిత గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతతో వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సేవలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, కాలుష్య నియంత్రణ, రహదారి విస్తరణ, వైద్య సేవల మెరుగుదల, సీఎస్ఆర్ నిధుల సమర్థ వినియోగంపై కీలక నిర్ణయాలు తీసుకుంటారని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జన జాగరణ యాత్రను విజయవంతం చేయండి

**పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, మహేందర్**

**సీపీఎస్ జనజాగరణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ**




**వరంగల్, జూలై 23 (పీపుల్స్‌డైరీ) :** ఈనెల 29న వరంగల్ లో జరిగే జనజాగరణ యాత్రను విజయవంతం చేయాలని పి ఆర్ టి యూ టీ ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈదునూరి రవీందర్ రెడ్డి, నకిరెడ్డి మహేందర్ పిలుపునిచ్చారు. సీపీఎస్ ఈయూ చేపట్టిన జన జాగరణ యాత్ర వాల్ పోస్టర్‌ను గురువారం వరంగల్ పి ఆర్ టి యూ భవన్‌లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004లో ప్రవేశపెట్టిన సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. పదవీ విరమణ అనంతరం సామాజిక భద్రత కల్పించడంలో సీపీఎస్ పూర్తిగా విఫలమైందని, ఉద్యోగులకు గౌరవప్రదమైన జీవన భరోసా కల్పించాలంటే పాత పెన్షన్ విధానం (ఓ పి ఎస్)ను పునరుద్ధరించాల్సిందేనని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో జనజాగరణ యాత్ర జులై 11 నుండి నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యూ టి ఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కటకం రఘు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కర్ర యాకుబ్ రెడ్డి, తుమ్మలపల్లి శ్రీనివాసరావు, గుంటి సురేష్,రాష్ట్ర డైరీ ముద్రణ కమిటీ సభ్యుడు కూనమల్ల రాజన్ బాబు, వివిధ మండలాల బాధ్యులు గజ్జెల విజయ్ కుమార్, పాక కృష్ణ కుమార్, మార్త శ్రీనివాస్, మేడిద నాగేశ్వరరావు, బానోతు కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బుక్యా బాలరాం, టి ఎస్ సి పి ఎస్ ఈ యు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిన్నారపు బుచ్చన్న, సంఘ రవి, కొండ శ్రీనివాస్, రవీందర్ యాదవ్, ఉదయ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలు





నడికూడ, జూలై 23 (పీపుల్స్‌డైరీ) : నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్,బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ వారి చిత్రపటాలకు పూలమాలవేసి అనంతరం విద్యార్థులతో మాట్లా డుతూ స్వాతంత్ర్యం నా జన్మ హక్కు అని బాలగంగాధర్ తిలక్ భారతీయులని ఉత్తేజ పరిచారనీ, నా పేరు ఆజాద్.. నా తండ్రి పేరు స్వాతంత్ర్యం అని బ్రిటిష్ వారినే ఎదిరించిన చంద్రశేఖర్ ఆజాద్ ఆజాద్ అని, బ్రిటిష్ వారి చేతిలో బలవకుండా తనకు తానే కాల్చుకొని వీరమరణం పొందిన వీరుడని అన్నారు. అనంతరం నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కంచరాజు కుమార్ పుల్లూరి రామకృష్ణ అంగన్వాడి టీచర్ బీముడి లక్ష్మి ప్రీ ప్రైమరీ టీచర్ బండి శ్వేత పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం.. హసన్‌పర్తిలో కాంగ్రెస్ నిరసన



**హసన్‌పర్తి, జూలై 23 (పీపుల్స్ డైరీ):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్ ఘటనకు నిరసనగా హసన్‌పర్తి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మరియు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామ్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణికుంట్ల అశోక్, బ్లాక్ ఓ ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, 65వ డివిజన్ అధ్యక్షుడు నేదునూరి సునీల్, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ లీకేజ్ దేశ విద్యా వ్యవస్థపై మచ్చగా నిలిచిందన్నారు. లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని వృథా చేసిన ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దేశ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం పోలీసు బలాన్ని ఉపయోగిస్తోందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. విద్యార్థులపై జరిగిన అన్యాయానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగు తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు, బ్లాక్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్, సర్పంచుల ఫోరం కన్వీనర్, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ, బీసీ, మైనారిటీ విభాగాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# కన్నాయిగూడెంలో బ్యాంక్ ఏర్పాటు చెయ్యాలి

బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత

**ఏటూరు నాగారం జూలై 23 (పీపుల్స్ డైరీ):** కన్నాయిగూడెం మండలం గుత్తివ్రుల గ్రామ పంచాయతీ పరిధిలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం గురువారం ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఈ సమావేశం కు ముఖ్య అతిధిదులుగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పళ్ళ బుచ్చయ్య బీజేపీ మండల పార్టీ ఇంచార్జీ లింగంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు అదేవిదంగా ఈ సమావేశం లో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత మాట్లాడుతూ బీజేపీ ని మండలం లోని బలోపేతం చేస్తూనే కాంగ్రెస్ చేస్తున్న అవినీతి అక్రమాలపై ప్రజలకు చెప్పాలని అన్నారు. అదేవిదంగా కన్నాయిగూడెం మండలం ఏర్పాటు చేసి ఇప్పటికి 9 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ ప్రజలకు రైతులకు బ్యాంక్ సౌకర్యం లేక కన్నాయిగూడెం మండలం లోని 6000వేల మంది 55కిలోమీటర్ల దూరం రావలసి వస్తుందన్నారు. అదేవిదంగా ఏటూరునాగారం బ్యాంకు కు 55కిలోమీటర్లు వెళ్ళినప్పటికి నెట్ వరకు లేక పోతే ఒక్క పనికి 2/3రోజులు తిరగడం వలన ప్రజల ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. అదేవిదంగా 1992లో కన్నాయిగూడెం పేరుతో ఏర్పాటు చేసినటువంటి పంజాబ్ నేషనల్ బ్యాంక్ ను నాడు సౌకర్యం లేదని కారణం తొ ఏటూరునాగారం మండల కేంద్రానికి తరలించడం జరిగింది అన్నారు. అదేవిదంగా కన్నాయిగూడెం మండలం లోని రైతులు 6000వేల మంది రైతుల అకౌంట్స్ మహిళ సంఘాల అకౌంట్ స్ కూడా పంజాబ్ నేషనల్ బ్యాంక్ లోనే ఉన్నాయి అన్నారు. అదేవిదంగా ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంజాబ్ నేషనల్ బ్యాంక్ ను కన్నాయిగూడెం తరలించిన మంచిదే ఆలా సాధ్యం కానీ యెడల కన్నాయిగూడెం లో నూతన బ్యాంక్ ఏర్పాటు చెయ్యాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత అన్నారు. ఈ సమావేశం లో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి గద్దం శ్రీనివాస్ జిల్లా కౌన్సల్ నెంబర్ ఆకుల సత్యం మండల ఉపాధ్యక్షులు బొగ్గుల భాస్కర్ పానుగంటి సంగీత మండల ప్రధాన కార్యదర్శి ఆకుతోట మధుకర్ బూత్ అధ్యక్షులు ఆలం రాంబాబు భూతు అధ్యక్షులు ఆకుతోట దుర్గాప్రసాద్ పళ్ళ వెంకటేశ్వర్లు శ్రీనివాస్ అనర్ కాసి సత్యం మరుగోని మౌనిక బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నార్కోటిక్ డాగ్‌తో సీసీఎస్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- గంజా నిర్మూలనే లక్ష్యం
- నార్కోటిక్ డాగ్‌తో గంజా నిందితులు, వినియోగదారుల ఇళ్లలో సీసీఎస్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**భూపాలపల్లి జూలై 23 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ పోలీసులు గురువారం ఉదయం నార్కోటిక్ డాగ్ సహాయంతో భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్, కాకతీయ కాలనీ, జంగేడు, ఖాసింపల్లి ప్రాంతాల్లో గతంలో గంజా కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు, గంజా వినియోగదారుల ఇళ్ల మరియు పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా గంజా నిందితులు, వినియోగదారులు మరియు వారి కుటుంబ సభ్యులతో పోలీసులు మాట్లాడి గంజా విక్రయం, రవాణా, నిల్వ, వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. అలాగే గంజా సేవిస్తున్న వారిపై, గంజా సేవిస్తున్న వారిపై కఠిన నిఘా కొనసాగుతోందని, భవిష్యత్తులో ఎవరైనా గంజా సేవిస్తున్నట్లు లేదా గంజా సంబంధిత నేరాల్లో పాల్గొన్నట్లు గుర్తిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని, గంజా విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు సమీప పోలీస్ స్టేషన్ లేదా జిల్లా పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని సీసీఎస్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా జిల్లా పోలీసులు నార్కోటిక్ డాగ్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు, నిఘా చర్యలు, అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ గంజా నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తారని తెలిపారు.



# మేడ్చల్‌లో కాంగ్రెస్ నిరసన.. ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దగ్ధం



**మేడ్చల్ జూలై 23(పీపుల్స్ డైరీ):-** మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ మరియు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ జంగయ్య యాదవ్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీతో పాటు ఇతర నేతల అరెస్టులను తీవ్రంగా ఖండించారు. అలాగే నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. నిర్బంధాలు, బెదిరింపులతో ప్రజల గొంతును అణచివేయలేరని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్, మేడ్చల్ సర్కిల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఎస్సీ సెల్ ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న ఆర్ఆర్ ఫౌండేషన్

నిరుపేద కుటుంబానికి అంత్యక్రియల కోసం రూ.10,000 ఆర్థిక సహాయం




**మేడ్చల్ జూలై 23 (పీపుల్స్ డైరీ) :** కష్టకాలంలో ఆపన్నహస్తం అందించడమే నిజమైన సేవ అనే విషయాన్ని ఆర్ఆర్ ఫౌండేషన్ మరోసారి నిరూపించింది. గిర్మాపూర్ గ్రామంలో ఇటీవల వరుస మరణాలతో తీవ్ర విషాదంలో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి అంత్యక్రియల నిర్వహణ కోసం ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10,000 ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకుంది. ఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ ఆ కుటుంబం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించారు. వారి సేవాభావాన్ని గ్రామ ప్రజలు హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ, "దేవుడు మాకు ప్రసాదించిన దాంట్లో కొంత భాగాన్ని ఆపదలో ఉన్న పేదలకు అందించడం మా బాధ్యతగా, మా ఆనందంగా భావిస్తున్నాం. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ సేవ చేయడమే మా ఫౌండేషన్ లక్ష్యం" అని తెలిపారు. గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ, "ఆర్ఆర్ ఫౌండేషన్ అందించిన రూ.10,000 సహాయం వారికి చిన్న మొత్తమే కావచ్చు. కానీ ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి అది ఎంతో పెద్ద అండగా నిలిచింది" అని పేర్కొన్నారు. గిర్మాపూర్ గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందుతున్న ఆర్ఆర్ ఫౌండేషన్, అవసరమైన ప్రతి సందర్భంలో ముందుండి సహాయం అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని గ్రామ ప్రజలు కొనియాడారు. "మనిషికి మనిషే తోడు" అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ, ఆర్ఆర్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నాయి..

# రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై బీఆర్ఎస్ నిరసన

**మేడ్చల్, జూలై 23(పీపుల్స్ డైరీ):-** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 297వ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీల దుస్థితితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి బీఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లో అనేక ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, డ్రైనేజీలు సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను వెంటనే గుర్తించి రోడ్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.




# సీఐ అంజిరెడ్డిని సన్మానించిన ఆటో యూనియన్ నాయకులు



**మేడ్చల్ జూలై 23(పీపుల్స్ డైరీ):** మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన సీఐ అంజిరెడ్డిని మేడ్చల్ ఆటో యూనియన్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ, మేడ్చల్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రత, ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. సీఐ అంజిరెడ్డి నాయకత్వంలో పోలీసులు ప్రజల మధ్య మరింత సత్సంబంధాలు నెలకొని, శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఐ అంజిరెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే తమ ప్రధాన లక్ష్యమని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ఆటో డ్రైవర్లు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఎర్ర విజయరావు, అశోక్, నరసింహ, వినోద్ కుమార్, బాలకృష్ణ, యాదగిరి, శ్రీనివాస్, సుధాకర్, రాజు, ఎల్లయ్యతో పాటు యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల పైప్ లైన్ లో గేట్ వాల్స్ లేకేజీ

వృధాగా గోదావరిలో కలుస్తున్న జలాలు..పట్టించుకోని సంబంధిత అధికారులు



**ఏటూరు నాగారం జూలై 23 (పీపుల్స్ డైరీ) :** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని జె చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ఎత్తిపోతల పథకంలో భాగంగా 10మోటార్లకి గాను 9మోటార్ల ద్వారా సుమారుగా 2306 క్యూసెక్కుల వరద నీటిని భీం ఘన్ పూర్ రిజర్వాయర్ లోకి ఎత్తిపోస్తున్నారు. దేవాదుల పైప్ లైన్ ముసుకునూరు, కంతనపల్లి గ్రామాల మధ్యలో 7-10 రోజుల నుంచి సుమారుగా 5-6 చోట్ల గేట్ వాల్స్ లేకేజ్ ఏర్పడి నీళ్లు వృధాగా పోవడం జరుగుతుంది. వృధాగా పోతున్న నీళ్లు మళ్ళీ తిరిగి వాగుల ద్వారా దేవాదుల పంప్ హౌస్ వద్ద ఉన్న గోదావరిలో కలవడంతో విద్యుత్ వృధా అవుతుందని పలువురి అభిప్రాయం. దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటిని ఎత్తిపోయడం మీద ఉన్న శ్రద్ధ లీకేజీలు అరికట్టడంలో లేదని పలువురు బహిర్గతంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైప్ లైన్ లీకేజ్ కాకుండా చూడాలని పలువురి స్థానికుల అభిప్రాయం.

# జంతర్ మంతర్ ఘటనపై రేగొండ కాంగ్రెస్ నేతలనిరసన

రాహుల్ గాంధీ అరెస్ట్ చేయడం పై ఆగ్రహం..



**రేగొండ జూలై 23 పీపుల్స్ డైరీ..** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్ష వ్యవహారంపై న్యాయం కోరుతూ ఆందోళన చేపట్టిన విద్యార్థులపై బలప్రయోగం చేయడం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ రేగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ ఆదేశాల మేరకు రేగొండ మండల కేంద్రంలో ఇందిరా గాంధీ సెంటర్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాల నర్సయ్య ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటనపై పార్లమెంట్ లో సమగ్ర చర్చ జరిపి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, మెరిట్ ఆధారిత విధానం, పేపర్ లీక్ పై కఠిన చర్యలు,అవసరమైతే బాధిత విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా తిరిగి పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# మేడ్చల్ సర్కిల్‌కు రూ.9.15 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

**మేడ్చల్, జూలై 23(పీపుల్స్ డైరీ):-** మేడ్చల్ మున్సిపాలిటీలను కార్పొరేషన్‌లో విలీనం చేసిన అనంతరం మేడ్చల్ సర్కిల్ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరయ్యాయి. మొత్తం రూ.9.15 కోట్ల (రూ.914.80 లక్షలు) వ్యయంతో 50 అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతి లభించింది. ఈ పనుల్లో ప్రధానంగా సీసీ రోడ్ల నిర్మాణం, బీటీ రోడ్ల మరమ్మతులు, వర్షపు నీటి కాలువల నిర్మాణం, డ్రైయిన్ డీసిల్టింగ్, తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు, బోర్‌వెల్ మోటార్లు, పంపుల మరమ్మతులు, ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ బ్లాకుల నిర్మాణం, మురుగు పైప్‌లైన్లు, మ్యాన్‌హోల్ చాంబర్ల మరమ్మతులు, జంక్షన్ మీడియన్ల అభివృద్ధి వంటి పనులు ఉన్నాయి. మేడ్చల్, పూడూరు-కిష్టాపూర్, గుండ్లపోచంపల్లి వార్డుల్లో ఈ పనులు చేపట్టనున్నారు. జాబితా ప్రకారం కొన్ని పనులు ఇప్పటికే పూర్తికాగా, మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. ఇంకొన్ని పనులు త్వరలో ప్రారంభం కానుండగా, కొన్ని టెండర్ ప్రక్రియలో ఉన్నాయి. అభివృద్ధి పనులు వేగంగా పూర్తయితే రహదారులు, డ్రైనేజీ, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడి ప్రజలకు మరింత సౌకర్యం కలగనుంది.


# ఫీనిక్స్ సొసైటీ, కాజిపేట సభ్యుల ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ




**ఏటూరు నాగారం జూలై 23 (పీపుల్స్ డైరీ) :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని వివిధ పాఠశాలల్లో గురువారం "బ్యాక్ టు స్కూల్ విత్ స్మైల్" అనే కార్యక్రమం కింద విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాలను తీర్చేందుకు అవకాశం కల్పించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చదువులో ముందుకు సాగుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తమవంతు సాయం అందించడంలో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు మరింత మద్దతు, సహాయం అందించాలని తమ ఆకాంక్షను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షఫీ తో పాటు ఫీనిక్స్ సొసైటీ ప్రెసిడెంట్ జీతు జాన్, సభ్యులు రెమ్యా జీతు, అన్నీ జాన్, పవన్ కుమార్, గౌతమ్, సంబంధిత పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పిల్లల్లో చదువుతో పాటు స్ఫూర్తిని నింపే "బ్యాక్ టు స్కూల్ విత్ స్మైల్" వంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో బలాన్ని, ఆశను ఇస్తున్నాయని వ్యవస్థాపక సభ్యులు చెప్పారు. సమాజంలో విద్య విలువను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరిన్నిసార్లు నిర్వహిం చబోతున్నామని తెలిపారు.

# రక్తంతో ఎమ్మెల్యే మల్లారెడ్డికి లేఖ..

## బీఆర్ఎస్ కార్యకర్త ఆవేదన వైరల్



**మేడ్చల్ జూలై 23 (పీపుల్స్ డైరీ):-** మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిని ఉద్దేశించి ఓ బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో లేఖ రాయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ పట్ల తన నిబద్ధతను, ప్రస్తుత పరిస్థితులపై తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ రాసిన ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లేఖలో, పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ముందుండి నడిపించిన నాయకత్వం, ప్రస్తుతం పార్టీ కష్టకాలంలో కార్యకర్తలకు దూరంగా ఉంటోందని కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యర్థి పార్టీల నాయకులతో కలిసి కనిపించడం వల్ల బీఆర్ఎస్ శ్రేణుల్లో నిరాశ నెలకొందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీ విజయాల వరకు వేలాది మంది కార్యకర్తలు త్యాగాలు చేశారని గుర్తు చేస్తూ, వారి భావోద్వేగాలను గౌరవించాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందన్నారు. అయితే ప్రస్తుతం కార్యకర్తలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. "మేము వ్యక్తుల కోసం కాదు... పార్టీ సిద్ధాంతాలు, తెలంగాణ ఆత్మగౌరవం కోసం పనిచేశాం. కార్యకర్తలను మరచిపోవద్దు. పదవులు శాశ్వతం కావు, కార్యకర్తల ప్రేమ, విశ్వాసమే నాయకుడిని చరిత్రలో నిలబెడతాయి" అని లేఖలో పేర్కొన్నారు. చివరగా, "ఈ లేఖను రక్తంతో రాయడం కోపంతో కాదు... పార్టీపై ఉన్న ప్రేమతో, నాయకత్వం మారాలని కోరుకునే ఆవేదనతో. కార్యకర్తల మనోభావాలను అర్థం చేసుకుని మళ్లీ వారి మధ్యకు రావాలి" అని ఎమ్మెల్యే మల్లారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ లేఖపై ఎమ్మెల్యే మల్లారెడ్డి లేదా బీఆర్ఎస్ పార్టీ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

# మధ్యలో చదువు ఆపేసిన వారికి శుభవార్త

## ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం



**మేడ్చల్ జూలై 23 (పీపుల్స్ డైరీ):-** మధ్యలో చదువు మానేసిన వారికి తిరిగి విద్యను కొనసాగించే అవకాశం కల్పిస్తూ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ ప్రవేశాలు ప్రారం భమైనట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ గడప నవీన్ తెలిపారు. మేడ్చల్ మండల పరిధిలో నివసిస్తూ మధ్యలో చదువు నిలిపివేసిన వారు అత్వెల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు పొందవచ్చు. 14 సంవత్సరాలు పూర్తి చేసిన వారు 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్‌లో చేరేందుకు అర్హులు. విద్యను కొనసాగించాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు అవసరమైన పత్రాలతో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు:శ్రీ గడప నవీన్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, అత్వెల్లి ఉన్నత పాఠశాల సంప్రదించవలసిన నంబర్: 9392585259

# కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన హనుమకొండ కలెక్టర్



**భీమదేవరపల్లి (జూలై 23): (పీపుల్స్ డైరీ ):** :భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేజీబీవీ పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి, విద్యా బోధన తీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి, వివిధ పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి విద్యా స్థాయిని, ప్రతిభను పరీక్షించారు. ఈ క్రమంలో ఒక విద్యార్థినితో బ్లాక్‌బోర్డుపై గణిత సూత్రాన్ని రాయించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ:పాఠశాలలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల వసతులు, సౌకర్యాలు సక్రమంగా అందేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

# విద్యార్థుల భవిష్యత్తు కన్నా కాంగ్రెస్‌కు రాజకీయాలే ముఖ్యం- చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్



**మేడ్చల్ జూలై 23(పీపుల్స్ డైరీ):-** ఢిల్లీలో గత రెండు రోజులుగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు చేపడుతున్న కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసమే జరుగుతున్నాయని మేడ్చల్ బీజేపీ సీనియర్ నాయకుడు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు తొందరగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మే 12న సీబీఐకి ఫిర్యాదు చేశారని, అనంతరం మే 15న సీబీఐ దర్యాప్తులో భాగంగా 13 మందిని అరెస్టు చేసిందన్నారు. అలాగే పరీక్షల పేపర్ లీకేజీ కేసుల్లో నాన్-బెయిలబుల్ అరెస్ట్‌కు అవకాశం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి మళ్లీ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారని, అనంతరం జూన్ 21న తిరిగి నీట్ పరీక్ష నిర్వహించగా, జూలై 16న ఫలితాలను విడుదల చేశారని చెప్పారు. ఫలితాల అనంతరం విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇదే సమయంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేసిన ఓ మాజీ ఉన్నతాధికారి మళ్లీ నీట్ పరీక్షలు నిర్వహించవద్దంటూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేసినప్పటికీ, కోర్టు దానిని తిరస్కరించిందని గుర్తు చేశారు. అయితే, కాంగ్రెస్ నాయకులు "కాక్రోచ్" అంశాన్ని ముసుగుగా చేసుకుని జూలై 28న అభిజిత్‌తో దీక్ష ప్రారంభించడం రాజకీయ నాటకమేనని, విద్యార్థులు లేని ఉద్యమాన్ని చేపట్టి దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైఖరిని తీవ్రంగా విమర్శిస్తున్నారని అన్నారు. నీట్ పరీక్షపై కనీస అవగాహన లేకుండానే మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు బీజేపీని విమర్శించడం సిగ్గుచేటని చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మేడ్చల్ బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ ను వెంటనే విడుదల చేయాలి

- విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.
- సోతుకు. ప్రవీణ్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు
- కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు




**భూపాలపల్లి జూలై 23 పీపుల్స్ డైరీ..** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ను విడుదల చేసి విద్యార్థులపై ఉన్న ఆర్థిక భారాన్ని తొలగిం చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు ఇప్పటికీ అద్దె భవనాలలో కొనసాగుతున్నాయని, దీనివల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రతి సంక్షేమ హాస్టల్‌కు శాశ్వత సొంత భవనాలు నిర్మించి, మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ డిమాండ్లను వినిపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ జడల రాజేశ్వరి, పోతుల పవన్, ఉల్లేరావు బన్నీ, రాజుల శివ, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

# మనల్ని మనం రక్షించుకోవడంలో స్వీయ సంరక్షణ ప్రాముఖ్యత చాలా అవసరం

- 108 అంబులెన్స్ ను తనిఖీ చేసిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్.



**శంకరపట్నం జులై: 23 పీపుల్స్ డైరీ:** స్వీయ సంరక్షణ ప్రాముఖ్యత లో భాగంగా శంకరపట్నం 108 అంబులెన్స్ ను భూమా నాగేందర్ గురువారం రోజున ఆకస్మిక తనిఖీ చేశారు. స్వీయ సంరక్షణ గురించి భూమా నాగేందర్ మాట్లాడుతూ వైద్యులు మరియు ఆసుపత్రుల పైనే ఆధారపడకుండా మనల్ని మనం రక్షించుకోవడంలో స్వీయ సంరక్షణ ప్రాముఖ్యత చాలా అవసరమని భూమా నాగేందర్ తెలిపారు. ప్రతి సంవత్సరం జూలై 24 న అంతర్జాతీయ స్వీయ సంరక్షణ దినోత్సవం నిర్వహించబడుతుంది. అని 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఒక నివేదిక విడుదల చేసింది. యూకే కి చెందిన ఇంటర్నేషనల్ సెల్ఫ్ కేర్ ఫౌండేషన్ 2011 లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. అని భూమా నాగేందర్ తెలిపారు 108 అత్యవసర సేవల విభాగం నివేదిక ప్రకారం తెలంగాణలో 17940 చాతి నొప్పి కేసులు నమోదయ్యాయి అందులో 30 మరియు 40 ఏళ్ల వయసు గల వ్యక్తులను కూడా గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువగా ప్రభావితం చేస్తుండడం ఆందోళన కలిగించే విషయం అని భూమా నాగేందర్ తెలిపారు. చాతి నొప్పి కేసులు వేగంగా పెరగడానికి ప్రధాన కారణం స్వీయ సంరక్షణ లోపించడమే ఇటువంటి గుండె జబ్బులను నివారించడానికి ప్రతి మనిషికి స్వీయ సంరక్షణ అనేది చాలా ముఖ్యం స్వీయ సంరక్షణలో భాగంగా ఎప్పటికప్పుడు తమ ఆరోగ్య పరిస్థితిని సరిచూసుకోవడం చాలా అవసరం ముఖ్యంగా రక్తపోటు, రక్తంలో చక్కర స్థాయిలు, మరియు లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవడం ద్వారా గుండె జబ్బులను కొంతవరకు నివారించవచ్చు. చాతి నొప్పితో బాధపడే వారిని కాపాడేందుకు ఈఎమ్ఆర్ఐ 108 అత్యాధునిక సాంకేతికతతో కూడిన అడ్వాన్స్డ్ లైఫ్ సపోర్ట్(గాూాూ )అంబులెన్స్ల సంఖ్యను కూడా పెంచింది అని భూమా నాగేందర్ తెలిపారు ఇట్టి కార్యక్రమంలో శంకరపట్నం 108 సిబ్బంది ఈఎంటి గూడూరి సతీష్ రెడ్డి. మరియు పైలెట్ మతి గోపికృష్ణ పాల్గొన్నారు.

# మూడు జిల్లాల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష




**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) జూలై 23:** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశమున్న నేపథ్యంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. హుస్నాబాద్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసర్ కాంప్లెక్స్‌లో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ పీఠభూమి ప్రాంతం కావడంతో సాధారణ పరిస్థితుల్లోనే వర్షాభావం ఉంటుందని, ఈసారి ఎల్ నినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. ప్రతి శాఖ కార్యాచరణ ప్రణాళికతో పనిచేసి తాగునీటి సరఫరా, పశుగ్రాసం, భూగర్భ జలాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రైతులు వరికి బదులుగా మొక్కజొన్న, కందులు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆయిల్‌పామ్ వంటి ఆరుతడి పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. విబిజీ రామ్‌జీ, తెలంగాణ జలసిరి పథకాల ద్వారా ఫామ్‌పాండ్లు, ఇంకుడు గుంతలు నిర్మించి ప్రతి వర్షపు చుక్కను సంరక్షించాలని సూచించారు. మంజూరైన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, గౌరవెల్లి ప్రాజెక్టు, శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, 250 పడకల ఆస్పత్రి, ఫోర్‌లైన్ రోడ్డు తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని, హుస్నాబాద్‌ను ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగించాలని సూచించారు. సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ రైతులను ఆరుతడి పంటల వైపు మళ్లిస్తూ కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, నీటి సంరక్షణపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ పంటల మార్పిడి, ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పీవీ విజ్ఞాన కేంద్రం పనులను వేగవంతం చేయాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

### వంగర లో పీవీ విజ్ఞాన కేంద్రం పనుల పరిశీలన



**భీమదేవరపల్లి జూలై 23 (పీపుల్స్ డైరీ ) :** మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు స్వగ్రామమైన హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలం, వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో విజ్ఞాన కేంద్రంలోని ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యాలు, ప్రాంగణంలో నాటిన మొక్కల పెంపకం నిర్వహణ తీరును కలెక్టర్ స్వయంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. తుది దశలో ఉన్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి త్వరలోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విజ్ఞాన కేంద్రం నిర్వహణ అత్యంత మెరుగ్గా, సందర్శకులకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్, కుడా సీపీవో అజిత్ రెడ్డి, డీఈ రఘు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఇతర అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# జూలై 26 న జరిగే రిజర్వేషన్ డే ను విజయవంతం చేద్దాం

- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్

**భీమదేవరపల్లి జూలై 23 (పీపుల్స్ డైరీ ) :** చత్రపతి సాహుజి మహారాజ్ జయంతి సందర్భంగా రిజర్వేషన్స్ డే సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ లో బహుజన సేన ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుచున్నది దీనికి ముఖ్య అతిథిగా జస్టిస్ నగేష్ భీమపాక ,గౌరవ హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక ఆహ్వానితులు చెక్కుడు ప్రభాకర్ సీనియర్ న్యాయవాది ,పెనుముల జగన్ మాజీ అధ్యక్షుల తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్, వక్తలు డాక్టర్ కదిరి కృష్ణ హైకోర్టు న్యాయవాది ,చలకాని వెంకట్ యాదవ్ తెలంగాణ బార్ కౌన్సిల్ నెంబర్ ,డాక్టర్ బెల్లయ్య నాయక్ ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు తదితరులు వక్తలుగా రావడం జరుగుతుంది బీసీ కులాల విముక్తి పూలే ,సాహుజి మహారాజ్ ,బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం ,దళిత క్రైస్తవుల సమస్యలు గత దశాబ్దన్నర కాలంగా భారతదేశంలో అణచివేయబడ్డ వర్గాలకు రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లు నిర్వీర్యం చేయబడ్డాయి 78 సంవత్సరాలు గడుస్తున్న భారత దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో ఏదో ఒక దగ్గర ఎస్సీ ,ఎస్టీ ,బీసీల పైన దళిత బడుగు బలహీన వర్గాల పైన దాడులు దౌర్జన్యాలు హత్యలు మర్డర్లు మానభంగాలు కులాహంకారాత్యాలు రాజకీయ హత్యలు మతపరమైన ఘర్షణలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో వివిధ ప్రాంతాలలో



దాడులు జరుగుతుంది రోజు మహిళల , మైనర్ బాలికలను అత్యాచారాలు చేయడం వాటిపైన ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని అటువంటి చర్యలకు పాల్పడుతున్న వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను తెలంగాణ అంబేద్కర్ సంఘం పక్షాన డిమాండ్ చేస్తున్నాం .చత్రపతి సాహుజి మహారాజ్ 1874 సంవత్సరంలో జూన్ 26 మహారాష్ట్రలో జన్మించిన సాహు మహారాజు గారు 1894లో కొల్లాపూర్ చక్రవర్తి అధికారంలోకి వచ్చినారు తన ప్రభుత్వం ద్వారా 1902 సంవత్సరంలో దేశంలో మొదటిసారిగా వెనుకబడిన కులాలకు 50% రిజర్వేషన్లు అమలుపరిచిన 1901 లో జైన్ హాస్టల్ విక్టోరియా బఠారి హాస్టల్ ,1906 లో మహమ్మదీయ విద్యార్థుల హాస్టల్ 1908లో మిస్ క్లర్క్ హాస్టల్ ప్రారంభించిన రిజర్వేషన్ పితామహుడు ఛత్రపతి సాహు మహరాజ్, బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో బహుజనులు ఎస్సీ ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి ప్రధాన కారకు ఈరోజు నూటికి 85% గా ఉన్న ఈ బహుజనులు ఈ సమాజంలో మనుషులుగా జీవిస్తున్నారంటే విద్యా ,ఉద్యోగాలు చేస్తున్నారంటే దానికి కారణం సాహూజి కృషి ఫలితం బహుజన సేన ఆధ్వర్యంలో జులై 26న రిజర్వేషన్ డే ను ఘనంగా నిర్వహించే పూలే ,సాహుజి ,అంబేద్కర్ల ఆలోచన ఈ సమాజంలో తీసుకెళ్లడానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జులై 26 న సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.పూలే ,సాహు ,అంబేద్కర్ ఆలోచనలే బీసీ కులాల విముక్తికి మార్గం అదేవిధంగా జుఔ, దళిత క్రైస్తవ సమస్యలపైన ,రిజర్వేషన్ల పైన చాలా లోతైన చర్చ చేయడం జరుగుతుంది కావున విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు ,నిరుద్యోగులు, కవులు కళాకారులు, అంబేద్కర్ లిస్టులు, మహనీయుల ఆలోచన విధానం పై నడుస్తున్న విద్యావంతులు ప్రతి ఒక్కరు పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరికి పేరుపేరునా విజ్ఞప్తి చేస్తున్నాం ఈ కా ర్యక్రమంలో గుగులోతు లక్ష్మణ్ నాయక్, తుపాకుల రవి అడ్వకేట్, కాదాసు రాజేష్,కొత్తపల్లి వంశీ, జోడుముంతల రమేష్, చల్ల కిరణ్,గాడిపెల్లి హరీష్, అల్లి వెంకటేష్,అనిల్, గుజ్జేటి శ్రీనివాస్, తాళ్లపల్లి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం -వొడితల ప్రణవ్

- రవాణా వ్యవస్థ ద్వారా గ్రామాలకు కనెక్టివిటీ పెంచుతున్నాం
- బొంతుపల్లి గ్రామంలో బస్ సర్వీసును ప్రారంభించిన ప్రణవ్

**వీణవంక జులై 24( పీపుల్స్ డైరీ) :** బొంతుపల్లి గ్రామం లో రిబ్బన్ కట్ చేసి బస్ ను ప్రారంభించిన ఒడితల ప్రణవ్. జమ్మికుంట నుండి గద్దపాక వరకు నడిచే బస్ ను పున ప్రాంభించారు. ప్రణవ్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాంమని వారు అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రణవ్ కు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు అనంతరం మహిళలతో కలిసి బస్ టికెట్ తీసుకొని బస్ లో ప్రయాణించారు. మహిళలతో మాట్లాడుతూ మహాలక్ష్మి, పథకంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని మహిళలను అడగగా అందుతున్నాయని చాలా సంతోషంగా ఉన్నామని వారు తెలిపారు.అంతకుముందు ఇదే గ్రామంలో 8 లక్షల ఎస్డియఫ్ నిధులతో నిర్మించిన కల్వర్టును ప్రణవ్ ప్రారంభించారు.ఈ కల్వర్టు ద్వారా సుమారు 60 ఎకరాలకు పై చిలుకు రైతులకు ఇది ఉపయోగపడుతుందని, ఈ విషయంను ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే మంజూరు చేపించిన ప్రణవ్ కు గ్రామస్థులు,రైతులు కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం



ప్రణవ్ మాట్లాడుతూ కోటి మంది మహిళలు కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ముందుకు వెళ్తున్నారని,ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు ప్రయోజనం చేకూరేలా పనులు చేస్తున్నారాని గ్రామాల్లో రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని దీన్ని గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని వారు తెలిపారు.ఈ సర్వీసు మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు జిల్లా ఇంచార్జి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి సీనియర్ నాయకులు గంగాడి తిరుపతిరెడ్డి, గంగాడి రాజిరెడ్డి, నల్ల కొండల రెడ్డి, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, సర్పంచులు బావు సంపత్, సరోజన, మధుకర్ రెడ్డి, అందే శ్రీమతి కుమార్ ,జడల శ్రీకాంత్ ,మాజీ సర్పంచులు ఎల్లారెడ్డి, చిన్నాల ఐలయ్య ,రాజ్ కుమార్ , మధుకర్, పార్లపల్లి రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీపతి రెడ్డి ,సునీల్, సతీష్ ,రషీద్ పాషా ,కాంగ్రెస్ పార్టీ నాయకులు వావిలాల సత్యనారాయణ కంకణాల జగదీశ్వర్ రెడ్డి జైపాల్ రెడ్డి ,కోమల్ రెడ్డి ,సంపత్, జితేందర్ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న సమీకృత మార్కెట్ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలి



అయిలేని మల్లికార్జున్ రెడ్డి

**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జులై 23 :** హుస్నాబాద్ పట్టణంలోని పాత ఎమ్మార్వో కార్యాలయ ఆవరణలో నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన సమీకృత శాఖాహార-- మాంసాహార మార్కెట్ భవనాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ రూ.2.70 కోట్ల వ్యయంతో 2022 ఫిబ్రవరిలో మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ శంకుస్థాపన చేసిన ఈ భవనం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా నిలిచిపోయిందని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను రాజకీయాలకు అతీతంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా చేపల మార్కెట్ నిర్వహిస్తున్న వ్యాపారులకు మున్సిపల్ అధికారులు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని, పెండింగ్‌లో ఉన్న మార్కెట్ భవనాన్ని పూర్తి చేస్తే వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి సమీకృత మార్కెట్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిత్తారి శ్రీనివాస్, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, అయిలేని గాల్ రెడ్డి, భూక్యా రాజు నాయక్, మార్క శ్రీనివాస్ గౌడ్, కనుక రాజు, సుకూర్, మాటూరి రాజశేఖర్ గౌడ్, చేపల వ్యాపారులు ముద్రవేణి సుగుణ, చొప్పరి వెంకటయ్య, హరిత, పెసరి నిరోషా తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 27న ఢిల్లీ లో నిర్వహించే జర్నలిస్టుల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఐ ఎఫ్ డబ్ల్యూ జే జాతీయ కమిటీ సభ్యులు చుంచు ఐలయ్య



**భీమదేవరపల్లి జూలై 23 (పీపుల్స్ డైరీ ) :**జర్నలిస్టుల న్యాయమైన హక్కుల సాధనకై ఈనెల 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద టి డబ్ల్యూజెఎఫ్ ,ఐఎఫ్ డబ్ల్యూజే సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు (ఐఎఫ్ డబ్ల్యూజే )జాతీయ కమిటీ సభ్యులు చుంచు ఐలయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ఈ ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు.రైల్వే రాయితీ పాసుల పునరుద్ధరణ,కరోనా సమయంలో రద్దు చేసిన జర్నలిస్టుల ఉచిత/రాయితీ రైల్వే పాసులను వెంటనే పునరుద్ధరించాలి.దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ఉన్న విలేకరుల భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని అమలు చేయాలి.సుదీర్ఘకాలం సేవలుందించి పదవీ విరమణ పొందిన రిటైర్డ్ జర్నలిస్టులకు సామాజిక భద్రత కల్పిస్తూ జాతీయ పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలి.ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా రంగాల సమస్యల పరిష్కారానికి జాతీయ మీడియా కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు, యూనియన్ నాయకులు ప్రతినిధులు ఈ నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చుంచు ఐలయ్య పిలుపునిచ్చారు.

# పురుగుల మందు తాగి మహిళ మృతి

**రేగొండ జూలై 23 పీపుల్స్ డైరీ..** పురుగుల మందు తాగి మహిళ మృతి చెందిన సంఘటన రావుల పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రేగొండ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం రేగొండ మండలం రావులపల్లి గ్రామానికి చెందిన కొండ లక్ష్మి ఌ/శ్రీ చంద్రయ్య (65) సంవత్సరాలు అను మహిళకు సంవత్సరం క్రితం కుడి కాలికి తీవ్రమైన ఇన్ఫెక్షన్ వచ్చింది తీవ్రమైన నొప్పితో



బాధపడేది అప్పటినుండి మానసికస్థితి కూడా సరిగా లేక తరచూ ఆందోళన చెందుతూ ఉండేది సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి వాంతులు తీసుకుంటుండగా గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే పరకాల ప్రభుత్వాసుపత్రి అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం ఎంజిఎం వరంగల్ కు తీసుకెళ్లి అడ్మిట్ చేసినారు .చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం చనిపోయినదనీ తెలిపారు. మృతురాలు కుడి కాలికి వచ్చిన ఇన్ఫెక్షన్ వలన మానసిక వేదన భావించలేక పురుగుల మందు తాగి చనిపోయినది మృతురాలు మరణం పై ఎవరిపై ఎటువంటి అనుమానం లేదనీ కొండా రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి సుధాకర్ రేగొండ తెలిపరు..

# నరేంద్ర మోదీ,అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం


విద్యారంగ సమస్యలపై కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ..



**వీణవంక జూలై 24( పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రఘుపాల్ రెడ్డి, విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యా విధానాలను అమలు చేయాలని విద్యా రంగానికి తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ప్రతినిధులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రఘుపాల్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గెలు శ్రీనివాస్ యాదవ్, గంగాడి రాజిరెడ్డి గంగాడి తిరుపతిరెడ్డి , ఐలయ్య యాదవ్, జగన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సత్యనారాయణ, మధుకర్ రెడ్డి, రామ్ రెడ్డి, నల్ల కొండల రెడ్డి, ఎల్లారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, కిరణ్, కుమార్, సునీల్ , శ్రీపతి రెడ్డి డైరెక్టర్, రమేష్ పర్లపెల్లి, గట్టయ్య, సంపత్, మధుకర్, రాజు , షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యం...

రాపోలు వీర మోహన్ -రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జులై 23 :** తెలంగాణ రాష్ట్ర చేనేత చైతన్య సభ పోస్టర్‌ను హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్, కోశాధికారి రఘు, రాష్ట్ర, జిల్లా నాయకులు సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా రాపోలు వీర మోహన్ మాట్లాడుతూ కరీంనగర్ పద్మశాలి కళ్యాణ మండపంలో ఆగస్టు 5న తెలంగాణ రాష్ట్ర చేనేత చైతన్య సభను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్రంలో గెలుపొందిన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులను సభలో ఘనంగా సన్మానించనున్నట్లు వెల్లడించారు. సభలో రాష్ట్రంలోని చేనేత కార్మికుల ప్రస్తుత పరిస్థితులు, సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై ప్రముఖులు ప్రసంగిస్తారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పద్మశాలి సామాజిక వర్గం, చేనేత కార్మికులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర, వివిధ జిల్లాల బాధ్యులు గాజుల భగవాన్ నేత, చింతకింది శ్రీనివాస్, ఎలిగేటి శ్రీనివాస్, విజయలక్ష్మి, ఉమారాణి, కుమారస్వామి, శారద, ప్రభాకర్, కోటేశ్వర్, నాగభూషణం, లక్ష్మీపతి, రజిని, అరుణ్ తేజ్, లక్ష్మీనారాయణ, రమేష్, కనకయ్య తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష సమావేశం

బీఎల్‌పలు సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేయాలి: వొడితల ప్రణవ్



**హుజురాబాద్, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమగ్ర ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ (ఎస్ఏఆర్)పై హుజురాబాద్ మండల, పట్టణ బీఎల్‌ఏలతో సమీక్ష సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డులు, గ్రామాల్లో ఇప్పటివరకు జరిగిన మ్యాపింగ్, అన్‌మ్యాపింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ప్రతి బీఎల్‌ఏ వద్ద ఉండాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత కోఆర్డినేటర్లకు సమాచారం అందించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను సమయానికి పూర్తి చేసి, హుజురాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, బీఎల్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన టిడిపి నాయకులు



**శంకరపట్నం జూలై : 23 పీపుల్స్ డైరీ :** శంకరపట్నం మండల కేంద్రం కేశవపట్నం తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండి. మహబూబ్ అలీ కుమారుడు ఇటీవల హైదరాబాద్ నగరంలో ప్రమాదంలో మృతి చెందాడు. కాగా ఆయన కుటుంబాన్ని మండల నాయకులతో కలిసి గురువారం రోజున కరీంనగర్ పార్లమెంట్ ఆడ్ హక్ కమిటీ సభ్యులు మోరే ప్రభాకర్ పరామర్శించారు. మృతుడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సానుభూతి పలికి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఎదిగిన ఒక్కగానొక్క కొడుకు మరణం కుటుంబానికి తీరని లోటు అని ఆయన అన్నారు. యూనస్ మరణ వార్త, ఆలీ సేవలను తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి సమాచారం అందించామని, తెలుగుదేశం పార్టీ మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కదిరే కొమరయ్య, గోపి వీరమల్లు, ఎండి సాబీర్, రాచర్ల సమ్మయ్య, దాసారపు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే బిజెపి లక్ష్యం

కొత్తకొండ లో మండల బీజేపీ కార్యవర్గ సమావేశం



**భీమదేవరపల్లి జూలై 23 (పీపుల్స్ డైరీ ):** భారతీయ జనతా పార్టీ భీమాదేవరపల్లి మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తకొండ గ్రామంలో మండల కార్యవర్గ సమావేశం విజయవంతంగా నిర్వహించబడింది. కొత్తకొండ బూత్ అధ్యక్షులు మీడిమల శ్రీనివాస్ జెండా ఆవిష్కరణ చేసిన తదనంతరం మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సిద్ధిపేట్ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.సమావేశంలో రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టి పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా కొత్తకొండ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని, శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అలాగే ఆ ప్రాంత అభివృద్ధికి భారతీయ జనతా పార్టీ నిరంతరం కృషి చేయాలని తీర్మానించారు.అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చిన ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని, ముల్కనూర్ ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ప్రజా ఉద్యమాలు చేపట్టి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో నిర్ణయించారు.ప్రజా సమస్యల పరిష్కారమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని, గ్రామీణాభివృద్ధి, దేవాలయ అభివృద్ధి, విద్య, వైద్యం వంటి అంశాల్లో పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో సిద్ధిపేట్ జిల్లా ప్రధానకార్యదర్శి ఖమ్మం వెంకటేశం. ఉపాధ్యక్షులు మాచర్ల కుమారస్వామి. జిల్లా కార్యదర్శి పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్. హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ లక్ష్మారెడ్డి. దొంగల కొమురయ్య. గందు సారయ్య. దొంగల రాణాప్రతాప్. పయ్యావుల రాజు. సిద్దమాళ్ళ రమేష్. భైరవోణి అనిల్. గుండెల్లి సదానందం. దొంగల వేణు. పిల్లి రవి. శనిగరపు ఐలయ్య. బొజ్జపురి పృథ్వీరాజ్. బొల్లంపెల్లి శ్యామ్. మోలుగు సంపత్. అంబీర్ కవిత.గిరిబోయిన అరుణ. అనిల్. సింగం రాజేందర్. మాడ్గుల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీఐ సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**మేడ్చల్, జూలై 23(పీపుల్స్ డైరీ):** మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన అంజి రెడ్డి గారిని గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి 299 డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్, 299 డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, బండారి అనిల్, లేబర్ సెల్ అధ్యక్షులు కావాలి భాస్కర్, ఒడ్డె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నూతన బాధ్యతల్లో సీఐ అంజి రెడ్డి విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందిస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో విశేష కృషి చేయాలని అభినందనలు తెలియజేశారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్.. ప్రజాస్వామ్యంపై దాడి

మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్



**ఆళ్ళపల్లి జూలై 23(పీపుల్స్ డైరీ)** ఆళ్ళపల్లి మండల కేంద్రములో బస్టాండ్ సెంటర్లు పినపాక శాసనసభ్యులు పాయ వెంకటేశ్వర్ల ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో గురువారం నాడు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ మాట్లాడుతూ పోటీ పరీక్షల పేపర్ లీకేజీలతో దేశంలోని లక్షలాదిమంది విద్యార్థులను నిరుద్యోగ యువత భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు ఈ అంశంపై ప్రశ్నించిన రాహుల్ గాంధీని అక్రమంగా అదుపులోకి తీసుకోవడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు పేపర్ లీకేజీ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్న కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని ఆందోళన చేసిన రాహుల్ గాంధీపై పోలీసులు బల ప్రయోగానికి దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు అరెస్టులు అక్రమ కేసులతో కాంగ్రెస్ శ్రేణులను భయపెట్టలేరని విద్యార్థులు నిరుద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు సర్పంచులు ఉప సర్పంచులు వార్డు నెంబర్లు తదితరులు పాల్గొన్నారు,

# వాణిజ్య పన్నుల శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- **సీనియర్ అసిస్టెంట్లకు ఏసీటీఓ ప్రమోషన్లు ఇవ్వాలని ముజాహిద్ హుస్సేన్ డిమాండ్**



**హైదరాబాద్, జూలై 22 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో ఖాళీగా ఉన్న డైరెక్ట్ రిక్రూట్ అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (ఐ=ాాజూా) పోస్టులను శాఖలో పనిచేస్తున్న ప్రమోట్ సీనియర్ అసిస్టెంట్లతో భర్తీ చేసి వారికి వెంటనే ఏసీటీఓ ప్రమోషన్లు కల్పించాలని తెలంగాణ కమర్షియల్ ట్యాక్సెస్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ డిమాండ్ చేశారు

## ప్రభుత్వానికి వినతిపత్రం

ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, రెవెన్యూ (వాణిజ్య పన్నులు, ఎక్సైజ్) ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. రఘునందన్ రావుకు సంఘం తరఫున వినతిపత్రం పంపినట్లు తెలిపారు. ఒకే చోట ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లకు బదిలీలు చేపట్టాలని కూడా కోరారు.

## కొత్త కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

ఉత్తర తెలంగాణలో కొత్త సీటీఓ కార్యాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు ఖమ్మంలో జాయింట్ కమిషనర్ (వాణిజ్య పన్నులు) పోస్టును మంజూరు చేయాలని కోరారు. అలాగే కాళేశ్వరం జోన్‌కు ప్రత్యేకంగా రామగుండంలో జాయింట్ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి మరింత ఆదాయం సమకూరుతుందని అభిప్రాయపడ్డారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, ఐదు డీఏలను వెంటనే అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్ బిల్లులు, హెల్త్ కార్డులు, జీవో 317 బాధితుల సమస్యలు, జీవో 190 అమలు వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## పెన్షన్ బకాయిలు వెంటనే చెల్లించాలి

2024 నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షనరీ ప్రయోజనాలు ఒకేసారి చెల్లించకపోవడంతో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొంతమంది పెన్షనర్లు మరణించారని ముజాహిద్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.పాల్గొన్న నాయకులు ఈ సమావేశంలో తెలంగాణ కమర్షియల్ ట్యాక్సెస్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండి బిక్షపతి, డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ సలావుద్దీన్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, నాయకులు హరిచరణ్, జగన్మోహన్ రెడ్డి, శ్రీకాంత్, ఈశ్వర్, సాగర్, శివరామకృష్ణ, అనూష, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి ఏ ఐ శిక్షణ అవసరం-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

- **ఆధునిక సాంకేతికతను సమర్ధంగా వినియోగిం చినప్పుడే అభివృద్ధి వేగవంతమవుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు.**

**భూపాలపల్లి జూలై 23 పీపుల్స్ డైరీ :** గురువారం ఐడిఓసీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం టీ ఫైబర్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ అడ్మినిస్ట్రేటివ్ డెఫిషియన్సీ ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యాలయాల్లో "ఏ.ఐ" ఆధారిత సాధనాల వినియోగం, ఫైళ్ల నిర్వహణ, నివేదికల తయారీ, డేటా విశ్లేషణ, కార్యనిర్వహణలో సమయాన్ని ఆదా చేసే విధానాలు, ప్రజా సేవల్లో సాంకేతికత పాత్ర వంటి అంశాలపై నిపుణులు వివరించారు.

## కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ....

కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతను ప్రభుత్వ పనుల్లో సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రతి అధికారి, ఉద్యోగికి శిక్షణ అవసరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలోనే కాకుండా ఐఏఎస్ అధికారులకు కూడా (ఏఐ)పై శిక్షణ ఇస్తున్న నేపథ్యంలో, జిల్లా స్థాయిలో అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ అవసరమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న "తెలంగాణ రైజింగ్--2047" సాధనలో జిల్లాల అభివృద్ధి కీలకమని తెలిపారు.ప్రస్తుతం అనేక మంది అధికారులు (చాట్ జిపిటి, క్లౌడ్ ) వంటి "ఏఐ" సాధనాలను ఉపయోగిస్తున్నారని, అయితే వాటిపై పూర్తిగా ఆధా రపడకుండా జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. ఏఐ పనులను సులభతరం చేసి, జ్ఞానాన్ని పెంపొందించే సాధనమే కానీ, తుది నిర్ణయం మాత్రం అధికారులదేనని స్పష్టం చేశారు. ఏఐ ఇచ్చే సమాచారం, సూచనలను తప్పనిసరిగా ధృవీకరించిన తర్వాతే వినియోగించాలని సూచించారు.



పరిపాలనా కార్యక్రమాల్లో ఏఐ ను విస్తృతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. అనంతరం జిల్లా పరిపాలనలో ఉపయోగిస్తున్న కొన్ని ఏఐ సాధనాలను అధికారులకు ప్రాక్టికల్‌గా ప్రదర్శించి, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్,విజయలక్ష్మి, ఎఐ ఎక్స్ పర్ట్స్ ధీరజ్, రాహుల్, ఈడీఎం శ్రీకాంత్, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సీఐ సూర్యప్రకాష్

- **సీఐ ఎస్ఐ లను ఆటో యూనియన్ నూతన కమిటీ సభ్యులు పోలీసు అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.**

**ఏటూరునాగారం జూలై 23 (పీపుల్స్ డైరీ) :** ఏటూరునాగారం ఆటో యూనియన్ నూతన కమిటీ అధ్యక్షుడు ఇర్సవడ్ల కిరణ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు గురువారం ఏటూరునాగారం పోలీస్ సీఐ సూర్యప్రకాశ్, ఎస్ఐ మహేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు శాలువాలు కప్పి సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆటో యూనియన్ నూతన కమిటీ సభ్యులను పోలీసు అధికారులకు పరిచయం చేశారు.ఈ సందర్భంగా సీఐ సూర్యప్రకాశ్, ఎస్ఐ మహేష్ లు మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణం కాకూడదని సూచించారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.2రోజుల క్రితం 5సం రాలు బాలుడు తప్పిపోయి ఏడుస్తూ



ఒంటరిగా కనిపించడంతో ఆటో డ్రైవర్ ముదురుకోళ్ల శ్రీకాంత్ మానవతా దృక్పథంతో బాలుడుని అక్కున చేర్చుకొని మూడు గంటలపాటు బాలుడు యోగక్షేమాలు చూసుకుంటూ పోలీస్ వారికి సమాచారం అందించి సోషల్ మీడియా అన్ని గ్రూపులలో సమాచారం అందించి తల్లిదండ్రులకు గ్రామ పెద్దలు ప్రజల సమక్షంలో అప్పగించడం అభినందనీయమని ఆటో యూనియన్ వారిని ఈ సందర్భంగా అభినందించారు. మంచి సేవా కార్యక్రమాలు నిత్యం చేపట్టాలని మంచి కార్యక్రమాలకు పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరు బాలరాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇర్సవడ్ల కిరణ్, నాయకులు ముదురుకోళ్ల సతీష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీపై డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



**మేడ్చల్ జిల్లా 23 (పీపుల్స్ డైరీ):-** పీహెచ్‌సీపై డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ నిర్లక్ష్యంపై వైద్యాధికారికి షోకాజ్ ఆదేశాలు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, ఔషధాల నిర్వహణ, రికార్డులు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీ సమయంలో వైద్యాధికారి డా. విజయ్ చంద్ర గత కొన్ని రోజులుగా విధులకు క్రమం తప్పకుండా హాజరు కాకపోవడం, ప్రజలకు అందించాల్సిన సేవల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల డీఎంహెచ్ఓ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయానికి హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం క్షయవ్యాధి (టీబీ) మొబైల్ ఎక్స్-రే యూనిట్ పనితీరును సమీక్షించి, సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందుతున్నాయా అని పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో ఈ-ఔషధి పోర్టల్‌లో నమోదైన ఔషధ నిల్వలు, పంపిణీ వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి, మాన్యువల్ స్టాక్ రిజిస్టర్లతో సరిపోల్చి ధృవీకరించారు. గడువు ముగియబోతున్న మందుల కోసం ప్రత్యేకంగా "నియర్ ఎక్స్‌పైరీ డ్రగ్ కార్నర్" ఏర్పాటు చేసి, వాటి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని ఫార్మసీ అధికారికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డా. కె. ఆనంద్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆరోగ్య సేవల్లో ప్రజల సంక్షేమమే అత్యున్నత ప్రాధాన్యమని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని గౌరవంగా, ఆప్యాయంగా ఆదరించి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని తెలిపారు.విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే విధి సమయాలను ఖచ్చితంగా పాటించాలని, నిర్ణీత యూనిఫామ్‌లో విధులకు హాజరుకావాలని, ఆసుపత్రి పరిశుభ్రతను కాపాడాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని కఠినంగా పరిగణించి అవసరమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు.

# ముల్కనూర్ సహకార సంఘాన్ని సందర్శించిన శ్రీలంక ప్రజాప్రతినిధుల బృందం



**భీమదేవరపల్లి జూలై 23 (పీపుల్స్ డైరీ ) :** భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో భాగంగా శ్రీలంకకు చెందిన 32 మంది స్థానికంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల బృందం గురువారం ముల్కనూర్ సహకార సంఘాన్ని సందర్శించారు.హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్ ఐ ఆర్ డి పి ఆర్) పర్యవేక్షణలో ముల్కనూర్ సహకార సంఘాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ముల్కనూర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు శ్రీ ఆలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అంతర్జాతీయ ప్రతినిధులకు స్వాగతం పలికి, సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, రైతుల సంక్షేమానికి తీసుకుంటున్న కార్యక్రమాలు, సంఘ కార్యకలాపాల గురించి వివరంగాతెలియజేశారు.అనంతరం ప్రజాప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించి, వారు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ...."అంతర్జాతీయ స్థాయి ప్రజాప్రతినిధుల అధ్యయన పర్యటన కోసం ములుకనూర్ కోఆపరేటివ్ సొసైటీని ఎంపిక చేయడం గర్వకారణమని తెలిపారు.ములుకనూర్ మోడల్ తమ సభ్య రైతుల జీవితాల్లో తీసుకొచ్చిన గణనీయమైన మార్పులకు నిదర్శనమని తెలిపారు.శ్రీలంక ప్రతినిధులు ఈ మోడల్లోని ఉత్తమ విధానాలను అమలు చేయాలని సూచించారు.ఈ పర్యటనలో ఎన్ ఐ ఆర్ డి పి ఆర్ అధికారులు, శ్రీలంక ప్రజాప్రతినిధులు, ముల్కనూర్ సహకార సంఘం పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలం చెరపలేని ఊరి కథ...

# గర్వానికి నిలువెత్తు శాసనం 'గణపురం'





**పీపుల్స్‌డైరీ-గణపురం :**

తెలంగాణ చరిత్రలో కాకతీయుల పేరు ప్రస్తావనకు వస్తే వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, రామప్ప ఆలయం మాత్రమే చాలామందికి గుర్తుకు వస్తాయి. కానీ అదే కాకతీయుల కళా వైభవాన్ని, నిర్మాణ నైపుణ్యాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని నిశ్శబ్దంగా తన గుండెల్లో దాచుకుని నేటికీ చరిత్రను చెబుతున్న ఒక అపురూప గ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం. మరో 8 ఏండ్లలో 800 సంవత్సరాల ఘన చరిత్రను పూర్తిచేసుకోనున్న ఈ గ్రామం, తెలంగాణ చారిత్రక వారసత్వంలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలువనుంది. కాకతీయ రాజుల కాలంలో వారు నిర్మించిన కొత్త ఊర్లకు, చెరువులకు రాజుల పేర్లు పెట్టడం ఒక ఆనవాయితీగా ఉండేది. గణపతిదేవుని కాలంలో తెలంగాణ వ్యాప్తంగా అనేక ఊర్లకు 'గణపవరం' లేదా 'గణపురం' అని, ఆయన తవ్వించిన చెరువులకు 'గణప సముద్రం' అని పేర్లు పెట్టారు. ఇక్కడి గణపసముద్రం చెరువు, గణపేశ్వరాలయం (కోటగుళ్ళు), రెడ్డిగుడి, పురాతన శాసనాలు, శిల్పాలు, నిర్మాణాలు నేటికీ కాకతీయుల సువర్ణయుగానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

చరిత్రక వివరాల ప్రకారం... క్రీ.శ. 1199 నుంచి 1260 వరకు కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన మహారాజు గణపతిదేవుడు పాలనలో గణపురం ఒక ప్రముఖ కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఆయన ఆదేశాలతో క్రీ.శ. 1213 ప్రాంతంలో గ్రామానికి ఈశాన్య దిశలో ఉన్న మట్టికోటలో అద్భుతమైన గణపేశ్వరాలయం నిర్మించబడింది.

**కాలం దాడి చేసింది... దండయాత్రలు ధ్వంసం చేశాయి... కానీ గణపురం ఆత్మను ఏ శక్తీ చెరపలేకపోయింది. ఈ నేల కేవలం ఒక గ్రామం కాదు, తెలంగాణ గర్వానికి నిలువెత్తు శాసనం. ఇది కేవలం ఒక ఆలయం కాదు, కాకతీయుల కళా ప్రాణానికి ప్రతిరూపం. గణపసముద్రం అలలు ఆగవు... కోటగుళ్ల చరిత్ర మౌనమవదు... గణపురం ఉన్నంతకాలం కాకతీయుల కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుంది. గణపతిదేవుని గంభీర గర్జన, గణపసముద్రం అలలలో నేటికీ వినిపిస్తుంది. కోటగుళ్ల శిల్పాల ప్రతి గీతలో కళామాత చిరునవ్వు మెరిసిపోతుంది. మరో 8 ఏండ్లలో 800 సంవత్సరాలు పూర్తిచేసుకోనున్న పవిత్ర ప్రాంతమిదే...**

ఈ ఆలయం కోట ప్రాకారాల మధ్య ఉండటంతో ప్రజలు దీనిని "కోటగుళు"గా పిలవడం ప్రారంభించారు. నేటికీ అదే పేరు ప్రజల నోట వినిపించడం విశేషం.

ఈ ఆలయం నిర్మాణానికి మరో చారిత్రక విశిష్టత కూడా ఉంది. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన కాకతీయ సేనాధిపతి రేచర్ల రుద్రరెడ్డి కుటుంబంతో గణపురానికి విడదీయరాని అనుబంధం ఉంది. ఆయన మూడో కుమారుడు, గణపురం సామంతుడైన గణపతిరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆలయం నిర్మించబడినట్లు చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. రాతిపై చెక్కిన శిల్పాలు, స్తంభాలపై కనిపించే సూక్ష్మ కళా నైపుణ్యం, శివాలయ నిర్మాణ శైలి నేటికీ కాకతీయుల శిల్ప సంపదను ప్రతిబింబిస్తూనే ఉన్నాయి.

గణపురం అనే పేరుకూ చరిత్రలో విశేష ప్రాధాన్యం ఉంది. కాకతీయ మహారాజు గణపతిదేవుడి పేరుతోనే ఈ ప్రాంతానికి "గణపురం" అనే పేరు వచ్చిందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. గ్రామంలో లభించిన పలు శాసనాలు, పురాతన కట్టడాలు, స్థానికంగా ప్రచారంలో ఉన్న చారిత్రక కథనాలు ఈ ప్రాంతం కాకతీయుల కాలంలో ఎంతటి ప్రాధాన్యం కలిగి ఉందో తెలియజేస్తున్నాయి.

గణపురం వైభవం కేవలం దేవాలయాలతోనే పరిమితం కాలేదు. గ్రామ శివారులో విస్తరించిన గణపసముద్రం చెరువు కాకతీయుల జలవనరుల నిర్వహణలోని అద్భుతమైన దూరదృష్టికి నిదర్శనం. ఎనిమిది శతాబ్దాల క్రితం నిర్మించిన ఈ చెరువు ఇప్పటికీ వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ రైతాంగానికి జీవనాధారంగా నిలుస్తోంది. అప్పట్లో ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం లేకుండానే నిర్మించిన ఈ చెరువు నేటి ఇంజినీర్లను సైతం ఆశ్చర్యానికి గురిచేసే స్థాయిలో ఉందని పలువురు చరిత్ర పరిశోధకులు పేర్కొంటున్నారు.

గ్రామంలోని రెడ్డిగుడి కూడా గణపురం చారిత్రక వారసత్వంలో కీలక భాగం. కాకతీయుల అనంతర కాలంలోనూ ఈ ప్రాంత సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనానికి కేంద్రంగా నిలిచిన ఈ ఆలయం నేటికీ చరిత్రను మౌనంగా చెబుతోంది.




అయితే చరిత్రలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న గణపురం, కాకతీయ సామ్రాజ్యం పతనానంతరం తీవ్ర దాడులకు గురైంది. సా.శ. 1323లో ప్రతాపరుద్రుడి మరణంతో కాకతీయ సామ్రాజ్యం అంతమవడంతో ఈ ప్రాంతంపై పలు దండయాత్రలు జరిగాయి. అనంతరం 15వ శతాబ్దం చివరి, 16వ శతాబ్దం ప్రారంభంలో కులీ కుతుబ్ ఉల్ ముల్క్ సేనల దాడుల్లో గణపేశ్వరాలయం తీవ్రంగా ధ్వంసమైనట్లు చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి. అయినప్పటికీ ఆలయంలో మిగిలి ఉన్న శిల్పాలు, రాతి స్తంభాలు, శిథిలాలు నేటికీ ఆ వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాయి.

కాలక్రమేణా ఈ చారిత్రక సంపదకు తగిన గుర్తింపు లభించకపోవడం చరిత్రాభిమానులను కలచివేస్తోంది. ఒకవైపు రామప్ప ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందితే, అదే కాకతీయుల నిర్మాణ వైభవాన్ని ప్రతిబింబించే గణపురం కోటగుళ్లు, గణపసముద్రం చెరువు, రెడ్డిగుడి వంటి చారిత్రక కట్టడాలు మాత్రం ఇంకా విస్తృత ప్రచారానికి దూరంగానే ఉన్నాయి.

పురావస్తు శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక శాఖ ప్రత్యేక దృష్టి సారించి గణపురాన్ని లి"కాకతీయ హెరిటేజ్ సర్క్యూట్"లిలో భాగంగా అభివృద్ధి చేస్తే దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయి. చారిత్రక కట్టడాల పరిరక్షణతో పాటు సమాచార ఫలకాలు, పరిశోధనా కేంద్రం, మ్యూజియం, పర్యాటక సౌకర్యాలు కల్పిస్తే గణపురం చరిత్ర భావితరాలకు సజీవంగా చేరుతుంది.

## దశాబ్దాల లెక్కింపు:

- ఏర్పడిన దశాబ్దం: క్రీ.శ. 1230-1240 మధ్య కాలం (కాకతీయ రాజు గణపతిదేవుని కాలంలో సామంతుడైన గణపతి రెడ్డి ఆలయాన్ని, గ్రామాన్ని ప్రతిష్ఠించిన సమయం).
- మొత్తం సంవత్సరాలు: 2026 - 1234 = 792 సంవత్సరాలు.
- పూర్తయిన దశాబ్దాలు: 792 సంవత్సరాలు / 10 = 79.2 దశాబ్దాలు (అంటే 79 దశాబ్దాలు పూర్తిగా ముగిసి, 80వ దశాబ్దం నడుస్తోంది).


మరో 8 సంవత్సరాలలో (క్రీ.శ. 2034 నాటికి) ఈ చారిత్రక గణపురం గ్రామం మరియు ఇక్కడి గణపేశ్వరాలయం ఏర్పడి సరిగ్గా 80 దశాబ్దాలు (800 సంవత్సరాలు) పూర్తి చేసుకోబోతున్నాయి.


- కనిపించే చరిత్రకు 792 ఏండ్లు
- ఘనమైన వారసత్వపు వెలుగులకు కేరాఫ్...
- నేటికీ చెరగని కాకతీయుల ముద్ర
- శిలల్లో నిద్రిస్తున్న సామ్రాజ్యం...
- మరో 8 ఏళ్లయితే 800 సంవత్సరాలు పూర్తి
- గణపసముద్రం, కోటగుళ్ళు, రెడ్డిగుడి గంభీర గర్జన
- చెరువులో నిక్షిప్తమైన ఇంజినీరింగ్ ప్రతిభ...


*రాతిలో చెక్కిన ప్రతి శిల్పం ఒక కథ చెబుతోంది... చెరువులో నిలిచిన ప్రతి నీటి బొట్టు కాకతీయుల దూరదృష్టిని గుర్తు చేస్తోంది... శిథిలాలుగా కనిపిస్తున్న ప్రతి గోడ తెలంగాణ వైభవాన్ని మౌనంగా వినిపిస్తోంది. చరిత్రను కేవలం పుస్తకాలలో చదవడం కాదు... గణపురంలో దాన్ని కళ్లారా చూడవచ్చు. ఈ అమూల్య వారసత్వాన్ని కాపాడి భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.*

















## 6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

**చిట్యాల, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని ముచినిపర్తి గ్రామానికి చెందిన గౌరిశెట్టి సత్యనారాయణ అనే కిరాణా వ్యాపారి ఇంటిపై దాడి నిర్వహించి అక్రమంగా తమ ఇంట్లో నిలువ చేసిన ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) బియ్యాన్ని అతన్ని గురువారం పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని స్వాధీనం చేసుకున్న బియ్యంతో పాటు తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం చిట్యాల పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అందించాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం రవాణా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

### జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**చిట్యాల, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి సీసీ కెమెరాల పనితీరు స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మరింత నాణ్యమైన పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సిఐ మల్లేష్ యాదవ్ ఎస్సై పోచంపల్లి సతీష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిషేధిత పొగాకు ఉత్పత్తులపై దాడి



**చిట్యాల, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులపై సీసీఎస్ పోలీసులు గురువారం దాడి రూ. 1,96,430 విలువైన గుట్కా పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగు తోంది. ఈ క్రమంలో భాగంగా గురువారం సీసీఎస్ పోలీసులు భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని చాముండా జనరల్ స్టోర్స్ దుర్గా జనరల్ స్టోర్స్ పవన కృష్ణ కిరాణం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అంబర్ ఆర్ఆర్ అనార్ జేకే మీరాజ్ తదితర నిషేధిత పొగాకు ఉత్పత్తులను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు గుర్తించి మొత్తం రూ. 1,96,430 విలువైన పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకు న్న నిషేధిత పొగాకు ఉత్పత్తులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కి అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడు తూ ప్రజారోగ్యానికి హానికరమైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ చేయడం విక్రయించడం లేదా రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డంపింగ్ యార్డును తలపిస్తున్న ప్రభుత్వ కార్యాలయం

### బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్



**నర్సంపేట, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట పట్టణంలోని శిథిలావస్థలో ఉన్న నీటిపారుదల శాఖ కార్యాలయ స్థలంలో చెత్తను విచ్చలవిడిగా వేయడంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డును తలపించేలా మారింది. పక్కనే ఉన్న హనుమాన్ దేవాలయ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు బాటసారులు వర్షాకాలంలో చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెత్త కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇంత దారుణమైన పరిస్థితి ఉన్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదా? వారు నిద్రపోతున్నారా? అని ప్రశ్నించారు. అలాగే, శిథిలావస్థలో ఉన్న నీటిపారుదల శాఖ కార్యాలయ స్థలాన్ని అక్రమార్కుల కబంధ హస్తాల నుంచి వెంటనే రక్షించి, ఆ స్థలానికి చుట్టూ బలమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు, అదేవిధంగా, ఆ స్థలాన్ని అభివృద్ధి చేసి పక్కనే ఉన్న హనుమాన్ దేవాలయ పాఠశాల విద్యార్థుల కోసం ఆటస్థలంగా కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. పిల్లలకు ఆటస్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ స్థలాన్ని ప్రజాప్రయోజనాలకు వినియోగించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. తక్షణమే చెత్తను తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు, శిథిలావస్థలో ఉన్న నీటిపారుదల శాఖ కార్యాలయ స్థలాన్ని రక్షించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, హనుమాన్ దేవాలయ పాఠశాల విద్యార్థుల ఆటస్థలంగా అభివృద్ధి చేయాలని బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

### ఎంఈఓ లింగాల కుమారస్వామి

**మొగుళ్ళపల్లి, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో తరగతి గదిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ లింగాల కుమారస్వామి అన్నారు. మొగుళ్లపల్లి మండల స్థాయిలో పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సిఈఆర్‌టీ తెలంగాణ ఆధ్వర్యంలో. (ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్") మూడు రోజుల శిక్షణ శిబిరం మొగుళ్ళపల్లి ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. క్వాలిటీ లెర్నింగ్ త్రో ట్రాన్స్ ఫార్మటివ్ క్లాసురూమ్ ప్రాక్టీసెస్ అనే థీమ్ తో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల కోసం ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి కోర్స్ డైరెక్టర్ మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి మాట్లాడుతూ, తరగతి గదిలో వినూత్న బోధనా పద్ధతులను అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమను తాము అప్డేట్ చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ



కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు భాగ్యశ్రీ, మండల రిసోర్స్ పర్సన్స్ వేణుమాధవ్, రాజ్‌కుమార్, సురేందర్, రామకృష్ణ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో బోధనా నైపుణ్యాలు, లెర్నింగ్ ఔట్ కమ్స్, క్లాసురూమ్ మానేజ్మెంట్ తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

# బురద మయంగా మారిన 11వ వార్డు

**గోవిందరావుపేట, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధి పసర గ్రామపంచాయతీ పరిధిలోని 11వ వార్డులో నాసిరకం మొరం పోయడంతో బురద మయంగా మారి రోడ్డుపై నడవ లేని దుస్థితి నెలకొనడంతో మహిళలు గురువారం బురద రోడ్డుపై వరి నాటు వేసి నిరసన తెలపడం జరిగింది, నిరసన తెలుపుతున్న వార్డు ప్రజలకు సిపిఎం పార్టీ మద్దతు తెలిపింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొదిళ్ల చిట్టిబాబు హాజరై మాట్లాడుతూ గతంలో రోడ్డుపై వర్షాకాలం ఎలాంటి బురద లేకుండా రోడ్డుపై ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రవాణా సాగించేవారు అని తెలిపారు, పాలకవర్గం అభివృద్ధి పనులు చేపట్టినట్లుగా ఉండాలని రోడ్లపై నాసిరకం మొరంపోయడంతో బురదమయంగా మారి వార్డు ప్రజలు నడవడానికి అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. గతంలో గ్రామపంచాయతీ పట్టించుకోక పోవడంతో సొంత డబ్బులతో వార్డు ప్రజలు మొరం పోయించుకున్నారని వారు తెలిపారు, పంచాయతీ పాలకవర్గంవెంటనే బురద మట్టిని తొలగించి నాణ్యమైన మొరంపోయించి వార్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందని తెలిపారు, నాసిరకంమొరం పనులు చేపట్టిన గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డు సభ్యుడు భాను ప్రసాద్ పైమహిళలు ధ్వజమెత్తారు. ఈ విషయంలో పలుమార్లు పాలకవర్గానికి తెలియజేసినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆరో ఆరోపించారు, వార్డు



నాటు వేసి నిరసన తెలుపుతున్న వార్డు ప్రజలు

ప్రజలుఓట్లు వేసి గెలిపించింది మంచిగా ఉన్న రోడ్డును బురదమయంగా చేసేందుకే నని ప్రశ్నించారు. విషయంలో నాసిరకం మొరంపై జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారిలు డిపిఓ, డిఎల్పిఓ, విచారణ జరిపి నాసిరకం మొరం పనులు చేపట్టిన వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు, లేనియెడల నాణ్యమైన మొరం పోసేంతవరకు సిపిఎం పార్టీ తరఫున గ్రామపంచాయతీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు వర్ధం సాంబశివరావు, అర్జుల వాసుదేవ రెడ్డి ,,శ్రీనివాస్ రెడ్డి, సంధ్య జయలక్ష్మి మంజు ల సునీత వరలక్ష్మి కనకమ్మ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలపై పోలీసుల ప్రత్యేక తనిఖీలు



**గోవిందరావుపేట, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** ములుగు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధి చల్వాయి గ్రామంలోపలు కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు జాగిలం తో పోలీసు బృందంకిరాణా దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. యువత ఆరోగ్యానికి హానికరమైన గంజాయి, మాదకద్రవ్యాలు, నిషేధిత అంబర్,పొగాకు ఉత్పత్తులు, గుట్కా తదితర నిషేధిత వస్తువుల విక్రయాలు జరుగుతున్న సమాచారం మేరకు ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టా మనీ ఎస్ అయితే తెలిపారు. దుకాణదారులకు ఎస్సై తాజుద్దీన్ అవగాహన కల్పిస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ నిషేధిత మత్తు పదార్థాలు, గుట్కా వంటి వస్తువులను విక్రయించవద్దని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా కఠినచర్యలు తీసు కోవడం జరుగుతుందని ఎస్ఐ తెలియజేశారు. గ్రామ ప్రజలు, యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ప్రాణాంతకమైన మతపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై యువతకు సూచించారు. తనిఖీల్లో పోలీసు జాగిలం, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# కేటీపీపీలో 27వ రోజు ఆందోళన కొనసాగింపు

### నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన.. - టెండర్ల ప్రక్రియ నిలిపివేయాలని డిమాండ్

**గణపురం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం (కేటీపీపీ)లో వైటీపీఎస్ సీహెచ్‌పీ, ఏహెచ్‌పీ విభాగాల టెండర్ల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన గురువారం 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని కేటీపీపీ ప్రధాన గేటు ఎదుట నిరసన తెలిపారు. సెంట్రల్ జేఏసీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. వైటీపీఎస్‌లో ప్రైవేటీకరణ చర్యలను విరమించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. టెండర్ల ప్రక్రియను తక్షణమే నిలిపివేసి ఉద్యోగుల ఆందోళనకు పరిష్కారం చూపాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయాలను ఉపసంహరించుకునే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ సంఘాలు, వివిధ యూనియన్‌లు, నాయకులు, సభ్యులు, పాల్గొని ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

# వర్షాల సమృద్ధిగా కురవాలని పూజలు

**ఏన్మూర్ జులై 23 (పీపుల్స్ డైరీ) :** వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని కోరుతూ గురువారం ఏన్మూర్‌లో గ్రామదేవతలకు పూజలు చేశారు. గత నెల రోజుల నుంచి వర్షాలు లేక రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాలు కురవాలని కోరుతూ ఏన్మూర్ గ్రామస్తులు గ్రామదేవతలకు జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని వరుణ దేవుడిని వేడుకున్నారు.





## రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం


### టీఆర్పీ మండల అధ్యక్షుడు రాజేష్

**మొగుళ్ళపల్లి, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల, రైతుల సమస్యలను పక్కనబెట్టి రాజకీయాలకే అధిక ప్రాధాన్యం ఇస్తోందని టీఆర్పీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బోనగిరి రాజేష్ విమర్శించారు. మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అదే సమయంలో విద్యార్థుల పేరుతో ధర్నాలు నిర్వహించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, సాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవడం లేదని. ప్రజా సమస్యలను పరిష్కరించ కుండా రాజకీయ విమర్శలకే పరిమితమవ డం దురదృష్టకరమని పేర్కొన్నారు.

## బుద్దారంలో వ్యవసాయ మోటార్, కేబుల్ వైర్ చోరీ

**గణపురం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని బుద్దారం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ మోటార్, కేబుల్ వైర్‌ను అపహరించుకెళ్లిన ఘటన వెలుగుచూసింది. స్థానికులు, బాధితుడి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన రైతు చేగొండ సంపత్ యాదవ్ తన పొలంలో వరి పంటను సాగు చేస్తున్నారు. పంటకు నీరందించేందుకు గాను తన బోరుబావి వద్ద విద్యుత్ మోటార్‌తో పాటు స్టార్టర్ బాక్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు పొలంలోకి చొరబడి, బోరుబావిలోని విద్యుత్ మోటార్‌తో పాటు సుమారు 40 మీటర్ల పొడవున్న కేబుల్ వైరును దొంగిలించారు. గురువారం ఉదయం పొలానికి వెళ్లిన సంపత్ యాదవ్, మోటార్, వైర్లు కనిపించకపోవడంతో షాక్‌కు గురయ్యారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ 25 వేల రూపాయలు వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. కష్టపడి సాగు చేసుకుంటున్న సమయంలో ఈ చోరీతో తీరని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## నేడు ఉద్యమకారుల మండల కమిటీ ఎన్నిక



**చిట్యాల, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల మండల తెలంగాణ ఉద్యమకారుల నూతన మండల కమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు జన్నె యుగేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్యాల మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా జేఏసీ కన్వీనర్ పైడిపల్లి రమేష్ మందల రవీందర్ రెడ్డి పున్నం రవి క్యాతరాజు సాంబమూర్తి తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు అమరుల కుటుంబ సభ్యులు బైండోవర్ కేసులు ఎదుర్కొన్న వారు జైలుకు వెళ్లిన ఉద్యమకారులతో మండల కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం హక్కుల సాధన కోసం మండల స్థాయిలో ఉద్యమకారులను ఏకం చేసి జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి అనుసంధానంగా ఈ కమిటీ పనిచేస్తుందని యుగేందర్ పేర్కొన్నారు.

# సింగరేణితో తెలంగాణ ప్రజలది భావోద్వేగ బంధం

## సత్తుపల్లి ఓసిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయి పరిశీలన





**ఖమ్మం, జూలై 23 (పీపుల్స్ డైరీ):** పోటీ ప్రపంచంలో సింగరేణి క్యాలరీస్ సంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వ్యాపార విస్తరణ ద్వారా భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి తెలంగాణకు ఆత్మలాంటిది.. కార్మికులు, ప్రజలతో 130 ఏళ్ల చరిత్రకలిగిన సింగరేణితో భావోద్వేగ అనుబంధం ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు లాభదాయకంగా అందించడం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు. గురువారం సత్తుపల్లిలోని సింగరేణి ఒపెన్ కాస్ట్ బొగ్గుగనిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిశీలించారు. గనిలో బొగ్గు లభ్యత, పరిమాణం, బొగ్గు క్వాలిటీని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుతో పాటుగా ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్ కో సీఎండీ హరీష్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోట్రూ, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మీడియాతో మాట్లాడుతూ... మైనింగ్ నిర్వహణలో పాటిస్తున్న పద్ధతులు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్తు ప్రణాళికలను ప్రత్యక్షంగా చూడటానికే క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. ఓవర్ బర్డెన్ అనేది మైనింగ్ లో బయటకు తీసే మట్టి, రాతి వ్యర్థం. బొగ్గు (కోల్) అనేది సింగరేణికి ప్రధాన రాబడి తెచ్చే అత్యంత విలువైన వనరుగా ఆయన అన్నారు. కాంట్రాక్టర్లకు ఓబి తీసినా, బొగ్గు తీసినా వాల్యూమ్ ప్రకారమే బిల్లులు వస్తాయి కాబట్టి వారి దృష్టిలో రెండూ ఒక్కటే అనిపించవచ్చని, సింగరేణి యాజమాన్యానికి మాత్రం ఓవర్ బర్డెన్, బొగ్గు మధ్య ఉన్న వ్యత్యాసం చాలా స్పష్టంగా తెలిసి ఉండాలన్నారు. ఫేస్ వద్ద బ్లాస్టింగ్ జరిపి, లోడింగ్ చేసే సమయంలో బొగ్గులో ఓవర్ బర్డెన్ మట్టి, రాళ్ళు కలవకుండా చూడాలన్నారు. ప్రతీ షావల్ దగ్గర, ప్రతీ లోడింగ్ పాయింట్ దగ్గర మన అధికారులు ఉండి కంటిన్యూయస్ మానిటరింగ్ చేయాలన్నారు. నాణ్యత లేని బొగ్గును రవాణా చేయడం వల్ల అనవసరమైన ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు పెరగడమే కాకుండా, థర్మల్ పవర్ ప్లాంట్లలో ప్రొడక్షన్ తగ్గిపోయి ట్రిప్ అవుతాయని అన్నారు. కల్తీ లేని నాణ్యమైన బొగ్గును మాత్రమే జెన్ కోకు ఇతర కస్టమర్లకు సరఫరా చేయాలని అధికారులకు సూచనలు చేశారు. ఒకప్పుడు బొగ్గు రంగంలో ఏకఛత్రాధిపత్యం ఉండేదని, ఈ రోజు పరిస్థితి మారిందని అన్నారు. మార్కెట్‌లో ప్రైవేటు సంస్థలు పోటీకి వస్తున్నాయని, విదేశాల నుంచి 'ఇంపోర్టెడ్ కోల్' వస్తోందన్నారు. ఈ కాంపిటీటివ్ మార్కెట్ లో సింగరేణి నిలబడాలంటే అత్యంత నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలన్నారు. అంతేకాక బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించడం ముఖ్యమని తెలిపారు. గత పదేళ్ల కాలంలో కొత్త కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనకపోవడం వల్ల చాలా అవకాశాలను కోల్పోయామని డిప్యూటీ సీఎం అన్నారు. ఒక కోల్ బ్లాక్ వేలంలో దక్కించుకుని, అక్కడ భూసేకరణ, అటవీ అనుమతులు సాధించి మైనింగ్ ప్రారంభించడానికి కనీసం 7 నుంచి 8 ఏళ్ల సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కనీసం 10 ఏళ్ల ముందస్తు ప్రణాళికతో పని చేయాలని అన్నారు. రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరుగుతుంది? దానికి ఎంత బొగ్గు అవసరం? అనేదానిపై సింగరేణి యాజమాన్యం-జెన్ కో యాజమాన్యం కలిసి కూర్చుని ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిచర్ల-2, నైని వంటి బ్లాక్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఫారెస్ట్ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించామని అన్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా జరిగే నూతన కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ప్రపంచం మొత్తం ఈ రోజు గ్రీన్ ఎనర్జీ వైపు వెళ్తోంది. సింగరేణి కూడా కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా సోలార్ ఎనర్జీ రంగంలోకి వేగంగా అడుగులు వేయాలన్నారు. భవిష్యత్తులో థర్మల్ పవర్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్, పంప్డ్ స్టోరేజ్, హైడ్రోజన్, న్యూక్లియర్ ఎనర్జీ వాడకం పెరుగుతుందని అన్నారు. దీనికి అనుగుణంగా సింగరేణి సోలార్ పవర్ ఉత్పత్తిపై మరింత దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. మైనింగ్ రంగంలో సింగరేణి సంస్థకున్న అపారమైన అనుభవం, నిపుణులైన సాంకేతిక శక్తి కేవలం బొగ్గుకే పరిమితం కాకూడదన్నారు. సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అవసరమైన క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, మైనింగ్ ప్రక్రియలోకి సింగరేణి ప్రవేశించాలని ఆయన పిలుపునిచ్చారు. సింగరేణిని కాపాడుకుంటూ, లాభాల బాట పట్టిస్తూ, ప్రపంచ స్థాయిలో నిలబెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి సిద్ధంగా ఉందని డిప్యూటి సీఎం అన్నారు. అధికారులు, ఇంజనీర్లు, కార్మికులు సమన్వయంతో పనిచేసి సింగరేణి ప్రభను మరింతగా వెలిగించాలని డిప్యూటీ సీఎం అన్నారు. అనంతరం కిష్టారంలో నిర్మించిన క్వార్టర్ల ను డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, యం. తిరుమల రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.

# తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట కార్యాచరణ

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలో నెలకొన్న 'ఎల్ నినో' తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల ఖమ్మం జిల్లా ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కొకుండా పటిష్ట కార్యాచరణ చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ దిశగా ప్రజా ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేసింది. జిల్లావాసులకు ఎలాంటి తాగు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని గత సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు యంత్రాంగం వేగంగా స్పందించి చర్యలు చేపట్టింది. వేగంగా నీటి తరలింపు భద్రాచలం వద్ద ఉన్న దుమ్ముగూడెం నుంచి రాజీవ్ కాలువ ద్వారా గోదావరి వెనుక జలాలను నాగార్జునసాగర్ (ఎన్ ఎస్పి) మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా నేరుగా వైరా చెరువుకు తరలిస్తున్నారు.

### క్షేత్రస్థాయిలో డిప్యూటీ సీఎం పరిశీలన

గురువారం నాడు ఎన్ఎస్పీ మెయిన్ బ్రాంచ్ కాలువకు వేగంగా వస్తున్న గోదావరి జలాలను డిప్యూటీ సీఎం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి ప్రవాహాన్ని, తరలింపు ప్రక్రియను సమీక్షించిన ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రధాన చెరువులను ఈ గోదావరి జలాలతో త్వరితగతిన నింపాలని ఆదేశించారు.

### నీటి ఎద్దడికి తావులేకుండా జాగ్రత్తలు

ఎల్‌నినో ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, జిల్లాలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరంపర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### ప్రజలకు ఊరట

ఎల్‌నినో ముప్పు పొంచి ఉన్న వేళ, సాగర్ మెయిన్ బ్రాంచ్ ద్వారా గోదావరి జలాలు వైరా చెరువుకు చేరుతుండటంతో ఖమ్మం జిల్లా ప్రజలకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఇర్రిగేషన్ సిఇ శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాస చారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.





## వర్షాభావ పరిస్థితులపై గ్రామ సభలు

**ఏన్కూరు, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని అరికాయలపాడు, భద్రుతండ , ఏన్కూరు గ్రామాలలో వర్షాభావ పరిస్థితులపై గ్రామసభలు జరిగాయి. బద్రు తండా గ్రామ సభకు వైరా వ్యవసాయ సహాయ సంచాలకులు టి కరుణశ్రీ పాల్గొని ముఖ్య సూచనలు చేశారు. ఇందులో భాగంగా ఎలినీనో ఎఫెక్ట్ వర్షాభావం తక్కువగా నమోదవుతున్న వేళ రైతులకు వరి, మొక్కజొన్న, మిరప లాంటి అధిక నీటి వినియోగం పంటలను వేయకుండా ప్రత్యామ్నాయ పంటలైన పంటలు అపరాల పంటలైన కందులు, పెసర్లు ,మినుములు తృణధాన్య పంటలైన జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు మరియు నూనె గింజల పంటలైన నువ్వులు, వేరుశెనగ వంటి పంటలు వేసుకుని ఈ ఎల్లిలో ప్రభావం నుంచి బయటపడాల్సిందిగా చెప్పారు. రెండవ అంశమైన పంట కుంటలు ఈ పంట కుంటలు తీసుకోవడం వలన రైతులకు పంటలు పండించుకోవడానికి చేప పిల్లల పెంచుకోవడానికి మరియు భూగర్భజలం లో వాటర్ స్టోరేజ్ రీఛార్జ్ అవ్వడానికి ఈ పంట కుంటలు అనేవి చాలా ఉపయోగపడతాయి సన్నా చిన్న కార్ రైతులు ఐదు ఎకరాల్లో భూముండి జాబ్ కార్డు ఉన్న ప్రతి రైతు కూడా ఈ పంట కుంటలు తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో భద్రతండ సర్పంచ్ బానోతు లక్ష్మ , వైస్ సర్పంచ్ షేక గాలిబ్ , మండల వ్యవసాయ అధికారి అవుకు నరసింహారావు , వ్యవసాయ విస్తరణ అధికారులు సైదులు, నవ్య, పంచాయతీ సెక్రటరీలు, ఇరిగేషన్ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ అధికారులు, ఎలక్ట్రీషియన్ డిపార్ట్మెంట్ , వెటర్నరీ డిపార్ట్మెంట్ అన్ని శాఖల అధికారుల నుంచి హాజరయ్యారు.

## డాగ్ స్క్వాడ్‌తో మధిరలో ముమ్మర తనిఖీలు

### గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు టౌన్ సీఐ డి.రమేష్



**ఖమ్మం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** మధిర పట్టణంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాలను అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వైరా ఏసిపి సారంగపాణి ఆధ్వర్యంలో మధిర టౌన్ సీఐ డి.రమేష్, ఎస్ఐలు కిషోర్ కుమార్, నవిత, మధిర టౌన్ పోలీసులు గురువారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ?ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే రైల్వే స్టేషన్, బస్టాండ్, స్థానిక హోటళ్ళు, పాఠశాలల, కళాశాలల ఆవరణలో ఉన్నటువంటి పాన్ షాప్ లో చాయ్ కొట్లు, కొరియర్ సర్వీస్ స్టాక్ పాయింట్స్ అయిన అమెజాన్, ఫ్లిప్కార్ట్, తదితర ప్రాంతాలలో ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌తో జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా సీఐ డి.రమేష్ మాట్లాడుతూ... మధిర పరిధిలో గంజాయి, డ్రగ్స్ లేదా ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేసినా, అమ్మకాలు జరిపినా, రవాణా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఖమ్మం నుంచి వచ్చిన స్పెషల్ నార్కోటిక్ డాగ్ ' పింకీ', డాగ్ హ్యాండ్లర్ రవి బృందంతో పాటు, మధిర టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గంజాయి మత్తు పదార్థాల రవాణా, విక్రయం, వినియోగ సమాచారం తెలిసినచో వెంటనే 8712659160, 1908 ఈ ఫోన్ నెంబర్లకి ఫోన్ చేయాలన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : డీఈఓ వాసంతి




**పినపాక, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** ఉపాధ్యాయులు తాము శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు రాబట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి సూచించారు. ఈ మేరకు గురువారం ఆమె పినపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఇన్ సర్వీస్ ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ట్రైనింగ్ శిబిరాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకుంటున్న అంశాలపై పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. శిక్షణ జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన డిఈఓ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో నైపుణ్యాలను ఈ శిక్షణ ద్వారా పెంపొందించుకొని వాటిని తరగతి గదిలో అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉంటేనే ఆ పాఠశాలలో చదువుతున్న బాలబాలికలకు ప్రాథమిక స్థాయి విద్యలో బలమైన పునాది ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ పరిధిలోని విద్యార్థులు ప్రతి ఒక్కరు అన్ని సబ్జెక్ట్ లలో కనీసం 80 శాతానికి తగ్గకుండా ఫలితాలు రాబట్టాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి టి. మాధవరావు, ఆర్ పి లు రాజేశ్వరరావు, కృష్ణయ్య, బాబురావు, షాలిని, సీఆర్పీలు పాల్గొన్నారు.

# ఎస్సీఆర్‌లోనే మధిరను కొనసాగించాలి



> **లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**
> **కొండపల్లి-మోటమర్రి రైల్వే సెక్షన్ విభజనకు తీవ్ర వ్యతిరేకత**
> **దక్షిణ మధ్య రైల్వే నుంచి ఎస్సీఓఆర్‌కు బదలాయించడం వల్ల తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం**
> **లోక్‌సభలో 377 నిబంధన కింద ప్రస్తావించిన కాంగ్రెస్ ఎంపీ**

**ఖమ్మం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** కొండపల్లి-మోట మర్రి రైల్వే సెక్షన్‌తో పాటు మధిర రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే (ఎస్సిఓఆర్) నుంచి విశాఖపట్నం ప్రధా న కార్యాలయంగా ఉన్న నూతన దక్షిణ కోస్తా రైల్వే (ఎస్సిఓఆర్) జోన్‌కు బదలా యించాలన్న ప్రతిపాదనపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా.. గురువారం 377 నిబంధన కింద ఆయన ఈ కీలక అంశాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. తెలంగాణలోని మధిర రైల్వే స్టేషన్ సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న

### ఎస్సీఆర్ (ఎస్సిఆర్) పాలనలోనే బాగు..

మెరుగైన రవాణా సౌకర్యాలు, మౌలిక వసతులు, సమయపాలన, ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌లతో అద్భుతమైన అభివృద్ధిని సాధించిందని ఎంపీ పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి ఎస్సీఆర్ అధికార యంత్రాంగం సమర్థవంతమైన సమన్వయం, సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం, ప్రయాణికుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు.

### విశాఖపట్నం కేంద్రంగా ఉన్న ఎస్సీఓఆర్ జోన్‌కు ఈ సెక్షన్‌ను మార్చితే పరిపాలనాపరమైన జాప్యం..

స్థానిక అవసరాలపై దృష్టి తగ్గడం, తెలంగాణ నుంచి వనరులు పక్కదారి పట్టే ప్రమాదం ఉందని ప్రజలు తీవ్రంగా భయపడుతున్నారన్నారు. ఈ రైల్వే సెక్షన్‌ను బదలాయించడం వల్ల క్రమక్రమంగా ఈ ప్రాంతంలో ఎస్సీఆర్ ఉనికి బలహీనపడుతుందని, హైదరాబాద్, ఖమ్మం, విజయవాడ తదితర కీలక గమ్యస్థానాలకు నిత్యం ప్రయాణించే వేలాది మంది ప్రయాణికులు నష్టపోతారని ఆయన వివరించారు. ఈ తీవ్ర ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని రైల్వే మంత్రిత్వ శాఖ తక్షణమే స్పందించి ఈ ప్రతిపాదిత బదలాయింపును ఉపసంహరించుకోవాల ని ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి కోరారు. మధిర, మోటమర్రి, ఎర్రుపాలెం రైల్వే స్టేషన్లతో పాటు ఖమ్మం జిల్లా ప్రాదేశిక పరిధి వరకు ఉన్న రైల్వే లైనును దక్షిణ మధ్య రైల్వే (ఎస్సిఆర్) జోన్ కిందనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. తద్వారా ప్రాంతీయ ప్రయోజనాలను పరిరక్షించి, ప్రయాణికులకు నిరంతరం మెరుగైన, స్నేహపూర్వక రైలు సేవలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశానికి ఎంపీ వద్దిరాజు



**ఖమ్మం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** క్రూడాయిల్, పెట్రోలియం, సహజవాయువు ఉత్పత్తులు,ధరలు వినియోగదారులకు మరింత అందుబాటులో ఉండేవిధంగా అవసరమైన చర్యలు తీసుకోవలసింది గా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం గురువారం ఢిల్లీలో చైర్మన్ తట్కారే సునీల్ దత్తాత్రే అధ్యక్షతన సమావేశమైంది. పశ్చిమాసియాలో తిరిగి నెలకొన్న సంక్షోభం దృష్ట్యా ఏర్పాటు చేసిన ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ... వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన సేవలందించడమే మన ముందున్న ప్రధాన కర్తవ్యం అన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, వాటి సంబంధిత ఉత్పత్తుల కొరత తలెత్తకుండా వినియోగదారులకు సత్వర, మెరుగైన సేవలందించాలన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తరచూ పెరగడం వల్ల రవాణా ఛార్జీలు, నిత్యావసరాలు, పండ్లు, కూరగాయల ధరలపై ప్రభావం పడుతుతున్నదని ఎంపీ రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
శుక్రవారం, 24 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 136


## ఇందిరమ్మ బిల్లులు వెంటనే విడుదల చేయాలి!

**సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు బాబు**



**మట్టెవాడ, జూలై 23 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగరంలోని 41వ డివిజన్ ఉర్సు దళితవాడలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు బాబు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటికీ ఇందిరమ్మ గృహాల బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా దళితవాడలో అనేక కుటుంబాలు ఇందిరమ్మ గృహాల బిల్లులు విడుదల కాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. అలాగే సీసీ రోడ్లు సరిగా లేకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ లోపించడం, దోమల సమస్య తీవ్రంగా ఉండడం వంటి పలు మౌలిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ గృహాల బిల్లులను విడుదల చేయడంతో పాటు దళితవాడలోని మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సింగారపు బాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిలగాని రాజు, పున్నం కవిత, రేణుక, రాజమణి, సుగుణ, యాకమ్మ, తిలక్, గౌసియా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలకు న్యాయం చేయాలి



**నూగురు వెంకటాపురం, జూలై 23(పీపుల్స్ డైరీ) :**మరికల గ్రామపంచాయతీలోని రామకృష్ణాపురం మాదిగలకు సర్వే నెంబర్ 9లోని ప్రభుత్వ భూమి విషయంలో అధికారులే న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యాసం రమేష్ అన్నారు. గురువారం ఎమ్మార్పీఎస్ సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసిల్దార్, సబ్ ఇన్స్పెక్టర్‌కు వినతి పత్రం అందించిన అనంతరం ఆయన మాట్లాడారు. దానవాయిపేట గిరిజనులు మాదిగలపై దాడికి దిగుతున్నారంటూ ఆరోపించారు. మాదిగలకు అసైన్మెంట్ పట్టాలు ఉన్నాయని తెలిపారు. ఇంటి స్థలాల నిమిత్తం ఉంచిన భూమిలో కావాలనే గిరిజనులు దాడులు చేస్తున్నారని అన్నారు. అధికారులు చొరవ చూపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నం తిరుపతి, చెన్నం గోపి, చెన్నం నరసింహారావు, చెన్నం ఎల్లయ్య, యాసం పోశాలు, సత్యం, నరసయ్య, సతీష్, ప్రశాంత్, సమ్మయ్య, ప్రసాదు, సత్యం, నవీన్, ఆనంద్, రాజు, నాగరాజు, నాని బాబు, వెంకటేష్, ఏసుబాబు, ముత్తమ్మ, జయమ్మ, బతుకమ్మ, సుగుణ, నరసమ్మ, రాణి, మదన, బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి : ఎంఈఓ కాలేరు యాదగిరి..



**కేసముద్రం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కేసముద్రం మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి అన్నారు. ఎఫ్ఎల్ఎన్ ఎన్రిచ్ మెంట్ కార్యక్రమం లో భాగంగా గురువారం కేసముద్రం విలేజ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటుచేసిన మూడు రోజుల ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాంను మండల విద్యాధికారి కాలేరు యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కాలేరు యాదగిరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులలో అభ్యసన లోపాలను గుర్తించి అభ్యసనంలో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారిలో ఎఫ్ ఎల్ ఎన్ నైపుణ్యాలను మెరుగు పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఉన్న ఉపాధ్యాయులకు తెలుగు, ఆంగ్లము సబ్జెక్టులలో రెమిడీయల్ టీచింగ్‌పై ఆర్పీలు వట్నాల సత్యనారాయణ, వై.అశోక్, ఈ.భాస్కర్, కె.సురేష్, వి. భాస్కరరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కల్వల, కేసముద్రం విలేజ్, ఉప్పరపల్లి పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్, రాజశేఖర్, చంద్రశేఖర్, వివిధ పాఠశాలల ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

## దీప్తా మాతగా భద్రకాళి



**మట్టెవాడ, జూలై 23 (పీపుల్స్ డైరీ):** వరంగల్ మహా నగరంలోని శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు గురువారంతో తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4గంటలకు నిత్యాహ్నికం పూర్తిచేసిన పిమ్మట అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి దీప్తా గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని కులసుందరీ గాను అంకరించి పూజారాధనలు నిర్వహించారు. ఈ రోజు తిథి నవమికి అధిదేవత దుర్గ శంకరుడికి సమరంలో అమ్మవారు దుర్గగా సహకరిస్తూ విజయాన్ని చేకూరుస్తుంది. అందుకే రాజులు, చక్రవర్తులు యుద్ధాలకు వెళ్ళేముందు దుర్గను ఆరాధించి వెళ్ళేవారు. భారత యుద్ధం ప్రారంభానికి ముందు కూడా శ్రీకృష్ణుడు అర్జునుడిని దుర్గను ప్రార్థించమని చెప్తాడు. ఆ ప్రార్థనలో అర్జునుడు చేసిన దుర్గాస్తుతిలో దుర్గను భద్రకాళిగా పలుమార్లు స్తుతిస్తాడు అర్జునుడు. అట్లాగే కాళీ క్రమాన్ని అనుసరించి దీప్తామాతగా అలంకరించబడిన అమ్మవారు జ్ఞానశక్తిని ఇస్తుంది. దీప్తా అనగా ప్రకాశింప చేయునది. సాధకునియందు అజ్ఞాన ఆవరణమును తొలగించి జ్ఞానము ప్రసాదింపచేసి ఇహపర సౌఖ్యములిచ్చునది దీప్తా ఈమెయే దుర్గా దుర్గతిని నశింపచేయు కాళి యొక్క నామాంతరమే దుర్గ. వాణి, లక్ష్మీ కాంతి, సిద్ధుల నిమిత్తం ఈ దేవతలను ఆరాధించాలని శాస్త్రాలు చెబుతున్నాయని ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. అట్లాగే షోడశీ క్రమాన్ననుసరించి అమ్మవారి ఉత్సవ మూర్తులలో జ్ఞానశక్తిని కులసుందరీ మాతగా అలంకరించి అర్చించారు. కులసుందరీమాత సకలైశ్వర్యాలతో కులవృద్ధిని జరుపుతుంది.

# పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మురళి నాయక్



**కేసముద్రం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ తెలిపారు. కేసముద్రం మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 44 మంది లబ్ధిదారులకు రూ.44,05,104 విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తున్నామని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి నెల రెండు పర్యాయాలు సీఎం సహాయనిధి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని లేదా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. అన్ని పథకాలు ఉచితంగానే అమలు అవుతున్నాయని స్పష్టం చేశారు.

### ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా సబ్సిడీపై అందించిన పెసర, మినుము, కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు ఈ .కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బానోతు సునీత, జిల్లా అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు నీలం దుర్గేష్, మాజీ జడ్పీటీసీ బండారి వెంకన్న, ఆర్టీసీ నెంబర్ రావుల మురళీ, సీనియర్ నాయకులు దాస్రూ నాయక్, మాజీ ఎంపీపీ సురేందర్, చిలువేరు సమ్మయ్య గౌడ్, డైరెక్టర్లు చిదురాల వసంతరావు, ఎండీ అయ్యూబ్ ఖాన్, చింతకుంట్ల యాదగిరి, కౌన్సిలర్లు వల్లందాసు ఉమా రవి, విజయ బద్య, ఎంపీడీవో క్రాంతి, డిప్యూటీ తహశీల్దార్ ఎర్రయ్య, వ్యవసాయ అధికారి వెంకన్న పాల్గొన్నారు.



## విద్యార్థులపై లాఠీచార్జీ అప్రజాస్వామికం

**కాకతీయ వర్సిటీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు**

**మట్టెవాడ, జూలై 23 (పీపుల్స్ డైరీ):** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ పేపర్ లీక్ తర్వాత ఆందోళనతో మరణించిన విద్యార్థులకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, భవిష్యత్తులో ఆరోపణలకు తావు లేకుండా పరీక్షలు పారదర్శకంగా, బాధ్యతా యుతంగా నిర్వహించాలని, సంసద్ ముట్టడికి బయలుదేరిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేయటాన్ని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఖండిస్తూ కళాశాల ప్రాంగణంలో నిరసన తెలియచేశారు. జూలై 20న పార్లమెంటు ముట్టడికి బయలుదేరిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయటం వలన వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడటమే కాకుండా ఒక విద్యార్థిని కూడా మరణించటానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావటం, సిబిఎస్ఈ పరీక్షల మూల్యాంకనంలో తప్పులు దొర్లటం, నీట్ పరీక్ష నిర్వహణలో లోపాలు తలెత్తడంతో దరిదాపు 55 లక్షల మంది విద్యార్థులు ఆందోళనకు గురైనారు కాబట్టి ప్రభుత్వం ఈ వైఫల్యాలకు బాధ్యత వహించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని ప్రభుత్వం ఇప్పటివరకు విద్యార్థులకు భరోసా ఇవ్వలేకపోయిందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు డాక్టర్ తిరునహరి శేషు,డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్, డాక్టర్ కొంగ వీరస్వామి, డాక్టర్ కనకయ్య, డాక్టర్ వెన్నంపల్లి విజయకుమార్, డాక్టర్ సునీత, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ బక్కి శ్రీనివాస్, డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ రవీందర్, డాక్టర్ హరిశంకర్, డాక్టర్ నవీన్, డాక్టర్ వావిళ్ళ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ



**మట్టెవాడ, జూలై 23 (పీపుల్స్ డైరీ):** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని చిరు వ్యాపారులకు వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నన్నపునేని మాట్లాడుతూ ప్రజలకు అండగా నిలవడం, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడడం కేటీఆర్ రాజకీయ జీవన విధానమని అన్నారు. వారి జన్మదినాన్ని ఆ ఆదర్శాన్ని కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## డాక్టర్ అనితా రెడ్డికి నెల్సన్ మండేలా పీస్ అవార్డు

**మట్టెవాడ, జూలై 23 (పీపుల్స్ డైరీ):** గ్లోబల్ హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ వారు డాక్టర్ అనితారెడ్డి చేస్తున్న సమాజ సేవను గుర్తించి నెల్సన్ మండేలా పీస్ అవార్డును అందించారు. అవగాహన సదస్సులతో పాటు ఆరోగ్య కరమైన సమాజానికి, యువత సన్మార్గ మార్పుకు డాక్టర్ అనితారెడ్డి అందిస్తున్న సేవలను గుర్తించి ఆమెను నెల్సన్ మండేలా పీస్ అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ ఫౌండర్ చైర్మన్ అడ్వకేట్ డాక్టర్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.అనితారెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, బాధ్యత మరింత పెరిగిందన్నారు. మానవ హక్కుల రక్షణ, లంచాలను అరికట్టడంలో భారత దేశం ఇతర దేశాలతో పోలిస్తే చాలా వెనక పడ్డమాట వాస్తవమని అన్నారు. ముఖ్యంగా వెనక పడటానికి కారణం మానవ హక్కులకు రక్షణ లేకపోవడం, విపరీ తంగా లంచాలు తీసుకోవడం పెరగడం, వినియోగదారుడు మోసపోవడం ఇవి ముఖ్య కారణాలు. అందుకే వీటిపై ఎక్కువ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి విలువలతో కూడిన యువతను తయారు చేయడంలో కీలకమైన పాత్ర పోషించి మావంతు సమాజ సేవ బాధ్యతగా చేస్తానని డాక్టర్ అనితారెడ్డి అన్నారు.

# కన్నీరు మిగిల్చిన రైలు ప్రయాణం..

**పురిట్లోనే కన్నుమూసిన కవలలు**

**అనాథల్లా మిగిలిన వలస జీవులకు అండగా నిలిచిన మహబూబాబాద్ యువకులు**

**మానవత్వాన్ని చాటిన 'అల్ అన్సార్, కంకర్‌బోర్డ్ యూత్' సభ్యులు**

**మహబూబాబాద్, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** కడుపులో పెరుగుతున్న పేగు బంధాన్ని తమ సొంత ఊరిలో, ఆత్మీయుల మధ్య ఆహ్వానించాలనుకున్న ఆ దంపతుల ఆశలు మార్గమధ్యంలోనే ఆవిరయ్యాయి. కళ్లు తెరిచి లోకాన్ని చూడకముందే ఆ కవలలు అనంత లోకాలకు పయనమయ్యారు. చేతిలో చిల్లిగవ్వ లేక, కనీసం ఆ పసికందుల మృతదేహాలను కూడా సొంత ఊరికి తీసుకెళ్ల లేని నిస్సహాయ స్థితిలో కుమిలిపోతున్న ఆ తల్లిదండ్రులకు.. స్థానిక యువకులు తోబుట్టువుల్లా అండగా నిలిచి



మానవత్వాన్ని చాటుకున్నారు. అందరినీ కంటతడి పెట్టిస్తున్న ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్‌లో చోటుచేసుకుంది.

### సొంతూరికి వెళ్తుండగా రైలులోనే పురిటి నొప్పులు..



ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోకు చెందిన మహమ్మద్ ఖలీద్ ఖాన్, సాలేహా దంపతులు పొట్టకూటి కోసం సుదూర ప్రాంతమైన కేరళలోని పాలక్కాడ్‌కు వలస వెళ్లారు. అక్కడ ఓ బేకరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాలేహా ఎనిమిది నెలల గర్భవతి. తమ బిడ్డల జననం కుటుంబ సభ్యుల మధ్య జరగాలని భావించిన ఆ దంపతులు.. రాప్తీ సాగర్ ఎక్స్‌ప్రెస్‌లో కేరళ నుంచి యూపీకి తిరుగు ప్రయాణమయ్యారు. రైలు ఖమ్మం దాటుతున్న సమయంలో సాలేహాకు ఒక్కసారిగా పురిటి నొప్పులు మొదలయ్యాయి. తోటి ప్రయాణికులైన మహిళలు స్పందించి ఆమెకు రైలులోనే ప్రసవం చేశారు. ఇద్దరు కవల పిల్లలు జన్మించారు. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు వెంటనే అప్రమత్తమై, మహబూబాబాద్ స్టేషన్‌లో రైలును నిలిపివేసి తల్లీబిడ్డలను హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### కాటేసిన పేదరికం.. ఆదుకున్న మానవత్వం

కానీ, ఆ పసికందుల ఆయుష్షు అక్కడితోనే తీరిపోయింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ ఇద్దరు శిశువులు కన్నుమూయడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఒకవైపు బిడ్డల మృతి.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు ఆ పేద దంపతులను కుంగదీశాయి. భాష తెలియని ఊరిలో, దిక్కుతోచని స్థితిలో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న వారి వేదన చూసి స్థానికుల హృదయాలు చలించిపోయాయి. విషయం తెలుసుకున్న మహబూబాబాద్‌కు చెందిన 'అల్ అన్సార్ యూత్', 'కంకర్‌బోర్డ్ ముస్లిమ్స్ యూత్' సభ్యులు వెంటనే స్పందించారు. బాధిత దంపతులకు తామున్నామంటూ భరోసా ఇచ్చారు. గురువారం మధ్యాహ్నం ఆ రెండు పసికందులకు ఇస్లాం సంప్రదాయం ప్రకారం సగౌరవంగా అంత్యక్రియలు నిర్వహించారు. తమకెవరో తెలియకపోయినా, కష్టకాలంలో అండగా నిలిచిన మహబూబాబాద్ యువకులకు ఆ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనతో, మానవత్వానికి ప్రాంతం, భాష అనే హద్దులు లేవని స్థానిక యువకులు మరోసారి నిరూపించారు.



# నీట్ లీక్‌పై పార్లమెంట్‌లో చర్చ జరపాలి

## రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ గణపురంలో కాంగ్రెస్ నాయకుల నిరసన రాస్తారోక

**గణపురం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్ డిమాండ్ చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ గురువారం గణపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రేపాక రాజేందర్ మాట్లాడుతూ, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడం, రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా తీసుకోవాలని కోరారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటిస్తూ మెరిట్ ఆధారిత విధానాన్ని అమలు చేయాలని, పేపర్ లీక్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైతే బాధిత విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా తిరిగి పరీక్షలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కటుకూరి శ్రీనివాస్, సర్పంచ్ లు ఎలుకపెల్లి రమేష్, తోట రాకేష్, ఉపసర్పంచ్ ఓరుగంటి కృష్ణ, నాయకులు తాళ్లపెల్లి భాస్కర్ రావు, చోటే మియా, విడిదినేని అశోక్, ఒద్దుల అశోక్ రెడ్డి, చింతిరెడ్డి సమ్మిరెడ్డి, మార్నేని ఉపేందర్ రావు, జోడు ప్రదీప్, తిక్క సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం నిర్లక్ష్య వైఖరిని ఎదిరించండి : ఎమ్మెల్యే

**కేసముద్రం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** ప్రజల సమస్యలు పరిష్కరించడం, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాల్సిన కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ ఆరోపించారు. గురువారం కేసముద్రం పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నిర్వహించిన మహా ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రశ్నించిన గొంతులను నొక్కడానికి కేంద్రం అరాచక పాలన సాగిస్తోందని, ఢిల్లీ ఘటననే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించడానికి ముందుకొచ్చిన కాంగ్రెస్ అధినేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసి కార్పొరేట్ శక్తులకు దాసోహంగా పనిచేస్తోందని విమర్శించారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం మరింత నియంతృత్వ ధోరణి అవలంబిస్తోందని దుయ్యబట్టారు. ప్రజలు సంఘటితంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎదిరించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, నాయకులు గుగులోత్ దసురు నాయక్, అంబటి మహేందర్ రెడ్డి, అల్లం నాగేశ్వరావు, నీలం దుర్గేష్, బండారు దయాకర్, బండారు వెంకన్న, ట్రాన్స్పోర్ట్ కమిటీ మెంబర్ రావుల మురళి, మార్కెట్ డైరెక్టర్లు అయ్యూభ్ ఖాన్, వసంతరావు, కదిరె సురేందర్, చిలువేరు సమ్మయ్య గౌడ్, దామర కొండ ప్రవీణ్, తండా వెంకటేశ్వర్లు, బనిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ ప్రభుత్వంతో విద్యార్థుల జీవితం ప్రశ్నార్థకం

## నీట్ పేపర్ లీక్ చేసిన వారిపై చర్యలు మాని విద్యార్థులపై దాడి అమానుషం



**మొగుళ్ళపల్లి, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మొగుళ్ళపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో. కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగుళ్ళపల్లి ప్రధాన కూడలిలో రోడ్డుపై బయట నుంచి నిరసన వ్యక్తం చేస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. యువత భవిష్యత్తు కోసమే రాహుల్ గాంధీ నిరసన వ్యక్తం చేశారని అలాంటి వ్యక్తిని అరెస్టు చేయడం అప్రజ్యాస్వామీకుమని అందుకు నిరసనగా. భారత ప్రధాని నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ. నీట్ పేపర్ లీక్ పై పోరాటం చేస్తున్న నీట్ విద్యార్థులకు మద్దతు తెలిపిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ శాంతియుతంగా నిరసన తెలియజేసినందుకు. కేంద్ర ప్రభుత్వం పాశవిక దాడులు చేస్తూ. రాహుల్ గాంధీని, ప్రియాంక గాంధీని పోలీసులు అరెస్టు చేయడం అప్రజ్యాస్వామికమని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో బిజెపి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుస్తుందని బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రశ్న పత్రాలు అమ్ముకుని బీజేపీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ. కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని జంతర్ మంతర్ వేదికగా అన్ని పార్టీలు, విద్యార్థులు చేపట్టిన రాజకీయాలకు అతీతంగా మద్దత్తు తెలిపాయని. దర్మేంద్ర ప్రధాన్ ను కేబినెట్ నుండి భర్తరఫ్ చేసి నీట్ పేపర్ లీక్ చేసిన వాల్లను జైల్లో పెట్టాల్సింది పోయి విద్యార్థులను పాషవికంగా దాడి చేస్తారా అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో చిట్యాల ఏఎంసి వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కల్లపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, క్యాతరాజు రమేష్, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దహనం

**గీసుకొండ, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ ఎంపీలపై జరిగిన అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, ఈరోజు గీసుమండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీసుకొండ మండల అధ్యక్షుడు దాడి శివ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీనివాస్ జిల్లా నాయకులు చాడ కొమరా రెడ్డి ఎనుమాముల డైరెక్టర్ ఆకుల రుద్ర ప్రసాద్ ,ఎలుకుర్తి సర్పంచ్ దివ్యభారతి ,సర్పంచ్ గాలి యాకయ్య ,కోమ్మల సర్పంచ్ యేమున ప్రవీణ్, సర్పంచ్ మౌనిక ప్రశాంత్, దిలిప్. సర్పంచ్ అఖిల్, సమన్వయ కమిటీ సభ్యులు పత్తిపాక రవీందర్, కూసంరమేష్, కిసాన్ ,సెల్ అధ్యక్షులు చెరుకుపల్లి సాంబరెడ్డి. సాయిల్ ప్రభాకర్ , ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము వినయ్ ,గీసుకొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఎండి జావిద్ ,నగరబోయిన సారంగం, కొమ్ము శ్రీకాంత్, మంద రమేష్, మేకల రాజకుమార్ ,నగర బోయిన నాగరాజు, మండ నరేష్, మర్రి క్రాంతి,తాటి కొండ నరేందర్ ,వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు కందికొండ రాజు దౌడు ప్రవీణ్ కె భాస్కర్, బాబురావు, నాగారం రవీందర్ ఈర్ల ప్రవీణ్ బద్రిరు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# నీట్ లీక్‌పై న్యాయం కోరితే లాఠీలా..?

## విద్యార్థుల గొంతు నొక్కొద్దు... కేంద్రంపై ఏఐఎస్‌ఏ ఆగ్రహం

**గణపురం, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** దేశంలో విద్యార్థుల పోరాట హక్కును హరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసి యేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా అధ్యక్షురాలు బుర్ర స్వాతి, జిల్లా కార్యదర్శి బంధు సుజాత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థుల సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. సీజీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా శాంతియుతంగా నిరసన తెలుపు తున్న విద్యార్థులపై అనవసరంగా లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులపై దాడులు జరిపించి, వారినే హింసాత్మకులుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీతో దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీ నామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో సమూల ప్రక్షాళన చేపట్టిన ప్పుడే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అరికట్టవచ్చని అభిప్రాయప డ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. లాఠీచార్జ్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే విద్యార్థి ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు.




# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలి

**మహబూబాబాద్, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** నీట్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్లో పిడిఎస్యు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసే సమయంలో పోలీసులు అడ్డుకున్నారని పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనగిరి మధు, జిల్లా అధ్యక్షుడు మునగాల మహేష్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి షేక్ షబ్బీర్ నాయకులు పార్థసారథి, సందీప్, అనిల్, లోకేష్, రాజేశ్వరి, మహేశ్వరి, నికిత, సాహిత్య తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ అరాచకాలపై బీజేపీ పోరాటం ఆగదు

## విద్యార్థుల పేరుతో కాంగ్రెస్ డ్రామాలు

## 12 వేల కోట్ల ఫీజు బకాయిలు కనిపించవా..?

## అధికారంలో ఒకలా.. ప్రతిపక్షంలో మరోలా

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోరే రవీందర్ రెడ్డి

**మొగుళ్ళపల్లి, జూలై 23 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో బీజేపీ అధ్యక్షులు మోరె వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో. రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను గురువారం బీజేపీ నాయకులు దగ్ధం చేశారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షులు మోరె రవీందర్ రెడ్డి మాట్లాడుతూ. దేశంలో కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలపై బీజేపీ పోరాటం తప్పదని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యల కోసం కాకుండా. రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పార్టీ నిరసన వ్యక్తం చేస్తోందని, అధికారంలో ఉన్నప్పుడు ఒకలా. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీ అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని, నీచమైన రాజకీయాలతో కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపేందుకు కుట్రలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎప్పుడో కాలగర్భంలో కలిపిన విషయాన్ని గుర్తుంచుకోవాలని. కాంగ్రెస్ నీచమైన సంస్కృతిపై ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ విద్యార్థుల సమస్యలపై స్పందించని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఇప్పుడు విద్యార్థుల పేరుతో ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో రూ.12 వేలకోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని ప్రభుత్వం. ఇతర అంశాలపై రాజకీయాలు చేస్తోందని ఆరోపించా రు. ఈ నిరసన విద్యార్థుల కోసం కాదని. బీజేపీకి పోటీగా నిలబడేందుకే కాంగ్రెస్ నిరసన లు చేస్తోందని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట. ప్రతిపక్షంలో ఉన్నప్పు డు మరో మాట మాట్లాడడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని మోరే రవీందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యం ముసుగులో కాంగ్రెస్ విధ్వంసాలకు పాల్పడుతోందని, రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తెలంగాణలో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్న సాగునీరు అందించాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం దారుణమన్నారు. ఢిల్లీలో ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ శ్రేణులు అరాచకం మూకల్లా వ్యవహరించారని ఆరోపించారు. ఒకవైపు దేశ రాజధానిలో విధ్వంసాలు సృష్టిస్తూ. మరోవైపు పోలీస్ ల అండతో రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూడడం కాంగ్రెస్ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక విధానాలపై బీజేపీ పోరాటం కొనసాగుతుందని రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం మండల కేంద్రంలోఈ కార్యక్రమంలో పోతుగల్లు గ్రామ సర్పంచ్ ఎలిగేటి తిరుపతి జిల్లా నాయకులు చెవ్వ శేషగిరి, బండారు రవీందర్, పోతుగంటి సాయిలు, మండల ప్రధాన కార్యదర్శి అరికాంతపు కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు తెప్ప రాజు, రాస బిక్షపతి, మండల నాయకులు బోయిని తిరుపతి, బూత్అధ్యక్షులు పొడిసెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com